


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :87 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ ఆదివారం - 04 - అక్టోబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!


2

- 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- రాయలసీమలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- మదనపల్లె వేదికగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన సర్కార్
- 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయి చేయూత
- ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం

# రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా చేసి చూపిస్తున్నా

- అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది.
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి కృతజ్ఞతలు.



అమరావతి : గాంధీ జయంతి సందర్భంగా కరవుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. అక్షరాలా రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాయలసీమ కరవు పరిస్థితులు, రైతుల కష్టాలను నిర్మలా సీతారామన్‌కు పలు సందర్భాల్లో వివరించానని రైతుల బాధలను నిర్మలా సీతారామన్ అర్థం చేసుకున్నారని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 'రాయలసీమ ఉద్యాన హబ్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అలానే అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చిందని ఏ ప్రాజెక్టునైనా జయప్రదం చేసేవరకు వదిలిపెట్టని వ్యక్తి అనంత్ అంబానీ అని ప్రశంసించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. సాగునీరు ఇస్తే బంగారం పండిస్తారు: రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పానని అలానే చేసి చూపిస్తున్నానని సీఎం అన్నారు. తాను, పవన్, మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. మోదీ నమ్మకాన్ని నిజం చేస్తూ నిర్మలాసీతారామన్ మిగతా..2లో

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి


2 లో

- ★ రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- ★ మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- ★ రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై

# సీఎం రేవంత్ ఆదేశాలివే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు ఈరోజు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు.
- సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది.




హైదరాబాద్, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. (శుక్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు. మిగతా..2లో

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు: మంత్రి కోమటిరెడ్డి హామీ

ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు మిగతా..2లో

## పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు


2

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి విక్రమార్క


2 లో

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..



### బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం

అమరావతి : నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. మిగతా..2లో

## విదేశీ అప్పులపైనే పాక్ బతుకు.. ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!



2

- విదేశీ రుణాలు, డిపాజిట్లపైనే ఆధారపడుతున్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ
- ఎగుమతులపై దృష్టి పెట్టకపోవడమే సంక్షోభాలకు అసలు కారణమని విశ్లేషణ
- చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ కూడా ఎగుమతులను పెంచడంలో విఫలం
- అప్పులు, డిపాజిట్లు తాత్కాలిక ఉపశమనమేనని నిపుణుల హెచ్చరిక
- ఎగుమతులు పెరగకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం.. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

- ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం
- 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్




ఢిల్లీ : భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత మిగతా..2లో

## కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు

- అక్టోబర్ 4- 6 మధ్య భారీ వర్షాలకు అవకాశం- తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకలోనూ వానలు
- ఏపీ, రాయలసీమలో బలమైన ఈదురుగాలుల హెచ్చరిక


2 లో

హైదరాబాద్: : వర్షాకాలంలో కూడా సమ్మర్‌లా ఎండలు మండుతుండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది! నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతంలో కొనసాగుతున్నా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. కేరళ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో అక్టోబర్ 7 వరకు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.

### తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

అమరావతి : రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్: గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం.. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు: మంత్రి కోమటిరెడ్డి హామీ

పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..

సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల



ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 - సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా - చేసి చూపిస్తున్నా

మొదటి పేజి తరువాయి

ముందుకు సాగుతున్నారని కొనియాడారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కుకు నిధులిచ్చి ఆదుకున్నారని తెలిపారు. సీమ దశ, దిశ మార్చి గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు తీసుకొచ్చామని, కరవు నేలను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. పండ్ల తోటల సాగులో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందని సాగునీరు ఇస్తే సీమ ప్రజలు బంగారం పండిస్తారని సీఎం కొనియాడారు. "ఎన్టీఆర్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకెళ్తున్నాం. హంద్రీనీవా ద్వారా నీళ్లు లేకపోతే మదనపల్లె మొత్తం వలసపోయేది. సీమ పరిస్థితులు మార్చేందుకు డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. పంటకుంటలు, వాటర్‌షెడ్ పథకాలు ఏర్పాటు చేసి జలసంరక్షణకు ప్రాధాన్యమిచ్చాం. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తిచేసి మూడేళ్లలో జాతికి అంకితం చేసే బాధ్యత మాది. సీమలో హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచి కెనాల్ విస్తరణ పూర్తికి చర్యలు తీసుకుంటాం.ా రాయలసీమను కరవు సీమ కాదని మరోసారి నిరూపిస్తా."- చంద్రబాబు, ముఖ్యమంత్రి 20 రకాల పంటల్లో ఏ పంట అయినా పండించే సత్తా సీమ రైతులదని ఉత్పత్తికి మార్కెట్ సౌకర్యమిస్తే సంపద సృష్టిస్తారని సీఎం చెప్పారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో పంటలు, ధరలు, వాతావరణ స్థిరీకరణ జరుగుతుంది వెల్లడించారు. అనంత్ అంబానీ పారిశ్రామికవేత్త మాత్రమే కాదు పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో జంతువుల పునరావాస కేంద్రాన్ని అనంత్ అంబానీ ఏర్పాటు చేశారని అలానే తిరుమల శ్రీవారిపై భక్తితో అనంత్ అంబానీ ఉచితంగా ఎలక్ట్రికల్ బస్సులు ఇచ్చారని వెల్లడించారు. పోలవరం పనులు ముమ్మరంగా సాగుతున్నాయమని ప్రాజెక్టును పూర్తిచేసి మోదీ చేతులమీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా ం!

మొదటి పేజి తరువాయి

అమరావతి: 'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### రూ. లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు.

పాదయాత్రలో చూసి.. మిషన్ రాయలసీమగా మార్చి..

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు.

### కరవు సీమ నుంచి ఫలాల సీమగా..



ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై సీఎం రేవంత్ ఆదేశాలివే

మొదటి పేజి తరువాయి

అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి




యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం అన్నారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇదని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలని వెల్లడించారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని ఆదేశించారు. సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ పాల్గొన్నారు.

## కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు

మొదటి పేజి తరువాయి

కోస్తాంధ్ర, రాయలసీమలో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి అక్టోబర్ 5 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాల విషయంలో మార్పులు కనిపించొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

### తమిళనాడులో గాలుల వేగం

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న కేరళ, లక్షద్వీప్, తమిళనాడు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తమిళనాడుతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలోనూ వాతావరణం మారే అవకాశం ఉంది. వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

### కర్ణాటకలోనూ వానలు

కోస్తా కర్ణాటకలో అక్టోబర్ 2న విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో అక్టోబర్ 5న అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో బెంగళూరు సహా దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం మారొచ్చు. మహారాష్ట్రలోని కోంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ అక్టోబర్ 7 వరకు అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది.

### ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాలు

దక్షిణాదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాల పరిస్థితి కొనసాగనుంది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని ఐఎండీ తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని చోట్ల భారీ వర్షం పడే అవకాశం ఉంది. ఒడిశా, బంగాల్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవుల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడొచ్చు. బిహార్, జార్ఖండ్‌లో అక్టోబర్ 5 నుంచి 7 మధ్య అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు



పడే అవకాశం ఉంది.

### ఉత్తరాదిలో రుతుపవనాల వెనక్కి ప్రయాణం

అదే సమయంలో ఉత్తర భారతంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు త్వరలో వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ రుతుపవనాల ప్రభావం తగ్గుతోంది. అలా ఉత్తర భారతంలో వానలు తగ్గి వాతావరణం పొడిగా మారుతున్నా, దక్షిణ భారతంలో మాత్రం అక్టోబర్ మొదటి వారం వరకు వర్షాల ప్రభావం కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులను గమనించాల్సి ఉంటుంది.

## విదేశీ అప్పులపైనే పాక్ బతుకు.. ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి అందే రుణాలు, సౌదీ అరేబియా, చైనా వంటి మిత్ర దేశాలు ఇచ్చే డిపాజిట్లపైనే దేశం పూర్తిగా ఆధారపడి ఉంది. ఈ నిధులు ఎప్పటికప్పుడు తలెత్తుతున్న చెల్లింపుల సంక్షోభం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) నుంచి తాత్కాలికంగా గట్టెక్కిస్తున్నప్పటికీ, దేశానికి దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ఓ నివేదిక స్పష్టం చేసింది. 'డాన్' పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం.. పాకిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తమ భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యతను అడ్డుపెట్టుకుని విదేశీ మద్దతు పొందడంపైనే దృష్టి సారించింది తప్ప, ఎగుమతి ఆధారిత సుస్థిర వృద్ధి నమూనాను నిర్మించలేకపోయింది. దీని ఫలితంగా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగినప్పుడల్లా అది దిగుమతులు, వినియోగం ఆధారంగానే జరిగింది. దీంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు తరచూ అడుగంటిపోవడం, సంక్షోభం తలెత్తడం ఒక చక్రంలా కొనసాగుతోంది. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అప్పటి సైనిక పాలకుడి హయాంలో పాకిస్థాన్‌కు భారీగా విదేశీ నిధులు, రుణమాఫీ, పెట్టుబడులు వెల్లువెత్తాయి. అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఆ నిధులన్నీ దిగుమతులు, వినియోగం, రియల్ ఎస్టేట్ రంగాలకు మళ్లడంతో 2008 నాటికి దేశం రికార్డు స్థాయిలో కరెంట్ ఖాతా లోటును ఎదుర్కొని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ముఖ్యంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) దేశంలో విద్యుత్ కొరతను తీర్చడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి దోహదపడింది. కానీ, విదేశీ రుణాలు తగ్గించుకోవడానికి అవసరమైన ఎగుమతుల వృద్ధిని మాత్రం సాధించలేకపోయింది. పైగా సీపీఈసీ ప్రాజెక్టుల కారణంగా దిగుమతులు మరింత పెరిగి 2018 నాటికి కరెంట్ ఖాతా లోటు మళ్లీ




ఆందోళనకర స్థాయికి చేరింది. కరోనా మహమ్మారి తర్వాత తీసుకున్న ఉద్దీపన చర్యలు, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కమోడిటీ ధరలు, రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ప్రస్తుతం దేశ విదేశీ మారక నిల్వలు పూర్తిగా ఐఎంఎఫ్ కార్యక్రమాలు, మిత్ర దేశాల డిపాజిట్లపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే, ఈ నిధులు దేశంలో ఆర్థిక కార్యకలాపాలను నేరుగా సృష్టించవని, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని తీసుకురావని నివేదిక హెచ్చరించింది. మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ నిధుల లభ్యత కూడా ఎప్పుడూ ప్రమాదంలోనే ఉంటుంది. గతంలో అభివృద్ధి ఆధారిత సహాయం, పెట్టుబడులు పొందిన పాకిస్థాన్, ఇప్పుడు అధిక వడ్డీ రుణాలు, స్వల్పకాలిక డిపాజిట్లపై ఆధారపడే స్థితికి దిగజారిందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా ఎగుమతుల వృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఆర్థిక స్థిరీకరణ ప్రయత్నాలు దీర్ఘకాలిక స్తబ్దతగా మారే ప్రమాదం ఉంది. ఫలితంగా, పాకిస్థాన్ తక్కువ వృద్ధి రేటు, మరో విదేశీ మారక నిల్వల సంక్షోభం మధ్య చిక్కుకుపోయే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



## నందివాడ సొసైటీలో 2 కోట్ల అవినీతిపై నివేదిక కోరిన లోకాయుక్త



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం నందివాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సొసైటీ కార్యదర్శి శ్రీహరిప్రసాద్ రైతుల ఋణాలను జమ చేయకుండా చేసిన రూ. 2 కోట్ల అవినీతిపై విచారణకు రాష్ట్ర లోకాయుక్త ఆదేశించింది.లోకాయుక్త కేసు నెం. 1992/2026/బి1 కింద రాష్ట్ర సహకార శాఖ కమీషనర్, కో-ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ ను నవంబర్ 18లోపు నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది.ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ 01.07.2026న ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త తల్లాప్రగడ మల్లిఖార్జునరావు ఈ ఉత్తర్వులు జారీ చేశారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. నందివాడ సొసైటీలో రైతులు రూ. 1.90 కోట్ల వరకు ఋణాలను చెల్లించినప్పటికీ,సొసైటీ కార్యదర్శి రైతుల ఋణాలకు జమ చేయకుండా అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ. దీనిపై రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ కు, రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన లోకాయుక్త సహకార శాఖ కమీషనర్ ను నివేదిక కోరింది.

## గుడివాడ మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ యు వీ.సుబ్బారావు



గుడివాడ,శ్రీ వార్త న్యూస్:గుడివాడ మండల పరిధిలోని మున్సిపల్ హైస్కూల్ బేతవోలు, గాంధీ మున్సిపల్ హైస్కూళ్లను జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.బేతవోలు పాఠశాలలో 6, 10వ తరగతి, గాంధీ



మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విషయ పరిజ్ఞానాన్ని, అభ్యసన ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ బుక్స్ ను పరిశీలించి, పాఠ్యప్రణాళిక ప్రకారం బోధన కొనసాగించాలని, నోట్ బుక్స్ క్రమం తప్పకుండా దిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.బేతవోలు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, భోజనాన్ని స్వయంగా రుచి చూశారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై మిషన్ మార్చ్-2027 లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 100 శాతం హాజరు సాధించేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

## సత్సంగ శాఖలు స్థాపించి యోగ మిత్రులకు తరుణోపాయం చూపిన ఆచార్యులు డా. వేద వ్యాస

--ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు --

(ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు)




నిడదవోలు,శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి :పూజ్య వేదవ్యాస గురుదేవుల ఆరాధన ఉత్సవాలు యోగమిత్ర మండలి ఆధ్వర్యంలో, నిడదవోలు సాయిబాబా మందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి సభా సంచాలకులుగ వ్యవహరించిన ప్రముఖ న్యాయవాది యోగమిత్రులు పాలకొల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ"భారతీయ సంస్కృతి వికాసం కోసం, సనాతన ధర్మ వ్యాప్తి కోసం, శతాధిక గ్రంథాలు వెలువరించిన " సద్గురువు " డా. వేదవ్యాస అని నివాళులు అర్పించారు.. ప్రయోక్త, అధ్యాపకులు డాక్టర్ వాడ్రేవు సుందరరావు మాట్లాడుతూ ' పూజ్య వేదవ్యాస బహుముఖ ప్రజ్ఞా శాలి అని, తమ జీవితమంతా శిష్యుల ఆధ్యాత్మిక ఉన్నతికోసం ధారపోసిన ' అపర వేదవ్యాసులే' అని శ్రద్ధాంజలి ఘటించారు...మరొక వక్త కృష్ణబాబు సిద్ధాంతి ప్రసంగిస్తూ 'మన సంప్రదాయంలో గురువుకు ఎంతో విశిష్ట స్థానం ఉందని, అనేక పరిశోధన గ్రంథాల ద్వారా విజ్ఞానాన్ని పంచడమే కాకుండా, సత్సంగ శాఖలు స్థాపించి యోగమిత్రులకు,భక్తులకు తరుణోపాయం చూపిన ఆచార్యులని శ్లాఘించారు. వేదవ్యాస గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పద్య పఠనాలు అలరించాయి.. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి కరిబంది విద్యా సంస్థల డైరెక్టరు, యోగ మిత్రులు త్రినాథ స్వామి, తెలుగు పండితులు మల్లెల కృష్ణమూర్తి, నిడదవోలు యోగమిత్రులు అరుణ్ కుమార్, శ్రీనివాస్, రాజమండ్రి, ఉనగట్ల, ఏలూరు,తదితర యోగమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ గురుదేవులకు నివాళులు అర్పించారు.

## వీఆర్ఏల నుండి వీఆర్వో గా ప్రమోషన్ ఇవ్వాలి -కనీస వేతనంపై పేస్కేల్ ను అమలు చేయాలి



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :ఘంటసాల మండలం రెవిన్యూ సహాయకుల సంఘం, రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు 15. నుండి నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు కొమ్ముకూరి బాపూజీ శనివారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మండల రెవెన్యూ శాఖల సంఘం అధ్యక్షుడు వక్కలగడ్డ వేణుగోపాలరావు , కార్యదర్శి నెరుసు వెంకటేశ్వరరావు కోశాధికారి కొండేటి మౌనిక వారి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను మండల రెవెన్యూ ఆఫీస్ వద్ద చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కమిటీ వారు మాట్లాడుతూ కనీస వేతనమైన పే స్కేల్ ను అమలు చేయాలని, అర్హులని వి ఆర్ ఏ లకు ప్రమోషన్ ఇవ్వాలని, కార్నర్ నియామకాలను చేపట్టాలని, వీఆర్ఏ నుండి వీఆర్వో గా ప్రమోషన్ జీవో 13 ప్రకారం ఇంటర్ క్వాలిఫికేషన్ తో ప్రమోషన్ ఇవ్వాలని, నామిని వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని ప్లే కార్డులతో నిరసన తెలియజేశారు.

# మచిలీపట్నం రూరల్ మండలంలో అభివృద్ధికి పెద్దపీట

రూ.164 కోట్లతో 604 పంచాయతీరాజ్ పనులకు శంకుస్థాపనలు

మచిలీపట్నం నియోజకవర్గంలో వివిధ శాఖల ద్వారా రూ.330 కోట్ల అభివృద్ధి పనులు

పోర్టు, షిప్‌యార్డ్, బీచ్ టూరిజంతో మచిలీపట్నం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ... రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర





కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:మచిలీపట్నం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా భారీగా అభివృద్ధి పనులను చేపడుతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో మంత్రి మాట్లాడుతూ, గతంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొంత మేరకు నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.రూ.330 కోట్లతో అభివృద్ధి పనులు మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల ద్వారా సుమారు రూ.330 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందినట్లు మంత్రి తెలిపారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు.మచిలీపట్నం రూరల్ మండలంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.164 కోట్లతో 604



అభివృద్ధి పనులు మంజూరు చేసి, వాటికి సంబంధించి శంకుస్థాపనలు చేపడుతున్నట్లు వివరించారు.అలాగే ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా సుమారు రూ.54 కోట్ల పనులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్ కింద ఇప్పటికే సుమారు రూ.10 కోట్ల పనులు ప్రారంభించామని తెలిపారు. మరో రూ.80 కోట్ల విలువైన పనులు ప్రభుత్వ అనుమతులతో త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.అభివృద్ధి--సంక్షేమానికి సమతూక ప్రాధాన్యతఅభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. కొత్త పింఛన్ల కోసం ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారికి త్వరలో పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.అంగన్‌వాడీ భవనాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలు కూడా చేపడుతున్నాం. పెద్దపట్నం వెళ్లే దారిలో దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.20 కోట్లతో ప్రారంభించాం. పోలాటితిప్ప - గరాలదిబ్బ మధ్య రూ.15 కోట్ల వ్యయంతో గుండేరు, నడిమేరు మీద రెండు వంతెనలు నిర్మిస్తున్నాం. చిన్నాపురంలో రోడ్డు సదుపాయం కల్పించే లక్ష్యంతో రూ.1.18 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలకు మేలు జరిగే అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. భోగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సభను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హతలను పరిశీలించి త్వరలో పింఛన్లు మంజూరు చేసే కార్యక్రమాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గోవా షిప్‌యార్డ్ ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలుమచిలీపట్నం ప్రాంతంలో భారీ పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని మంత్రి తెలిపారు. గోవా షిప్‌యార్డ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు రూ.8 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా దాదాపు 10 వేల ఉద్యోగావకాశాలు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.ఈ ఉద్యోగాల్లో స్థానిక యువతకు అవకాశాలు లభించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ అందించి, రానున్న ఉపాధి అవకాశాలను స్థానిక యువత సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.షిప్‌యార్డ్‌కు అనుబంధంగా వచ్చే పరిశ్రమలను ఆకర్షించేందుకు యం స్ యం ఇ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చిన్న, మధ్యతరహా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విషయంలో మచిలీపట్నం ప్రాంత ప్రజలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.'వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్'కు ప్రాధాన్యతప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో 'వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, వారికి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు అవసరమైన శిక్షణ, సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మార్చిలోగా మచిలీపట్నం పోర్టు ప్రారంభానికి చర్యలుమచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వచ్చే సంవత్సరం మార్చిలోగా పోర్టును ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పోర్టు, షిప్‌యార్డ్, అనుబంధ పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధితో మచిలీపట్నం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.బీచ్ టూరిజానికి ప్రత్యేక ప్రోత్సాహంమచిలీపట్నం తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇటీవల నిర్వహించిన మసుల ఫెస్టివల్ విజయవంతమైందని, అలాగే 63 అడుగుల సాగర మహాగణపతి విగ్రహ ఏర్పాటు ద్వారా మచిలీపట్నం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందేలా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.బీచ్ టూరిజాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలను పెంచేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.సముద్రతీరంలో 750 ఎకరాలను గుర్తించాం. ఫలితంగా గోల్ఫ్ సంస్థ, స్టూడియో ఏర్పాటుకు ఓ సంస్థ వచ్చింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న పెట్టుబడులు, అభివృద్ధి నిధుల్లో మచిలీపట్నానికి పెద్దపీట వేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న భారీ ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధితో మచిలీపట్నం మరింత అభివృద్ధి చెంది మహానగరంగా రూపుదిద్దుకునే దిశగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## యు వి ఆర్ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ పై అవగాహన

-- అప్రమత్తత -- సురక్షిత సమాజమే లక్ష్యం..... ఎస్ ఎఫ్ ఓ వెంకటేశ్వరరావు....



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని యు వి ఆర్ గొర్రెపాటి హైస్కూల్లో శనివారం ఫైర్ సర్వీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమం మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ రక్షణ చర్యలు, అత్యవసర సమయంలో సురక్షితంగా బయటకు వెళ్లే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఫైర్ సర్వీస్ సిబ్బంది ఉపయోగించే వివిధ రకాల బ్రాంచ్ పైపులు వాటి రకాలు, వాటి వినియోగ విధానం వివిధ రకాల అగ్ని ప్రమాదాలను నియంత్రించడంలో వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఫైర్ సర్వీస్‌లో ఉపయోగించే ఫైర్ హోసులు, బ్రాంచ్ పైపులు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, రెస్క్యూ పరికరాలు ఇతర ముఖ్యమైన ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్‌ను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి, వాటి ఉపయోగం పని విధానం గురించి అవగాహన కల్పించారు.ఎల్పిజి గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన అగ్ని ప్రమాదాన్ని నియంత్రించే విధానం మరియు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్‌ను సరైన పద్ధతిలో ఉపయోగించే విధానాన్ని ప్రాక్టికల్ డెమో ద్వారా ప్రదర్శించారు.అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించడం, సురక్షితంగా బయటకు రావడం మరియు ఇతరులకు సహాయం చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ లోయ నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు, ఎల్ ఎఫ్టి . వేణుగోపాల్, ఫైర్మాన్లు వెంగల్రావు, ఏ.వి.పూర్ణచంద్రరావు, డ్రైవర్ ఆపరేటర్ బి. ప్రదీప్, హోంగార్డ్ డి.ఎస్ .ఆర్. కె .ప్రసాద్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి: ఆర్డీవో కె. అరుణాదేవి




ఆదోని, అక్టోబర్ 2 జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఆదోని ఆర్డీవో కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదోని ఆర్డీవో శ్రీమతి కె. అరుణాదేవి మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత వంటి ఉన్నతమైన విలువలను సమాజానికి అందించారని తెలిపారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని, స్వచ్ఛతను పాటిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ బాబు , సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం :

సర్పంచ్ దండేవేన సంధ్యా బాణేష్



మంథని, 03 అక్టోబర్ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సర్పంచ్ దండేవేన సంధ్యా బాణేష్ అన్నారు. శనివారం గ్రామంలో నిర్వహించిన జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషకాహార లోపం, రక్తహీనతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు వంటి ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పుష్పలత, సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు బరిబద్దుల స్వరూప, మట్ట శారద, వంగళూరి కళావతి, అక్కపాక వరుణ, రమాదేవి, ఉప సర్పంచ్ ఎల్క లక్ష్మి, వార్డు సభ్యురాలు దేవుళ్ల లక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో గోదావరి పుష్కరాల ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్...



జగిత్యాల జిల్లా /ధర్మపురి, అక్టోబర్ 03 : ధర్మపురి పట్టణంలో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపడుతున్న ఘాట్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శనివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, పారిశుధ్య ఏర్పాట్లు, పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఇతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.తదుపరి ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. డయాలసిస్ సేవలు, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, రోగుల జాబితా, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ధర్మపురి తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీఓ రవీందర్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులు ప్రతి నోటీసుదారునికి అందేలా చర్యలు తీసుకోవాలి...జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల జిల్లా, అక్టోబర్ 03, మెట్ పెల్లి ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియకు సంబంధించి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులు ప్రతి నోటీసుదారునికి తప్పనిసరిగా అందేలా బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.నోటీసుల పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి నోటీసుదారునికి సకాలంలో నోటీసులు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. నోటీసులు అందించిన వివరాలను పక్కాగా నమోదు చేయడంతో పాటు, పంపిణీ ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, పంపిణీ, స్వీకరణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, మెట్ పెల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సంబంధిత మండల తహసీల్దార్లు, బీఎల్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల జిల్లా, అక్టోబర్ 03,ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మెట్పల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, సక్రమమైన పారిశుధ్య నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అదేవిధంగా వసతి గృహాల్లో అదనంగా నిర్మిస్తున్న వంటశాల, గదుల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పటివరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయో, మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేయవచ్చో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో పాటు, నిర్మాణంలో ఉన్న అదనపు సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, ఈఈ, పీఆర్ అధికారి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జై రాజ్, మండల తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కబడ్డీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమీక్ష



అశ్వారావుపేట ఆర్సీ / అక్టోబర్ 3 ):అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులను సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు,నిర్వాహకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లపై శనివారం అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల అధికారులు, క్రీడా కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సుదీర్ఘంగాచర్చించారు.క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు వసతి, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రేక్షకుల కోసం కూడా తగిన సౌకర్యాలు కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.



**క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత...**

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా ప్రాంతానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొననున్న నేపథ్యంలోనిర్వాహకులు, అధికారులుసమన్వయంతో పనిచేసి పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య సిబ్బంది, ప్రథమ చికిత్స సదుపాయాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.సమీక్ష సమావేశంలో అశ్వారావుపేట మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, జిల్లా జనరల్ సెక్రెటరీ కోలా లక్ష్మీనారాయణ, తుమ్మా రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు కట్ట సింధుజ, దండబత్తుల ఆదిలక్ష్మి, కారం కనకదుర్గ, ఆట్టం రమ్య, మిండా హరిబాబు, నార్లపాటి మహేష్, నార్లపాటి దివాకర్, తిరుమలశెట్టి వెంకన్నబాబు, మోర్ల రాజేశ్వరి, కొట్టే నాగసునీత, ఎస్.కె. రెహనా, ఎస్.కె. నూర్జహాన్, మైనార్టీ మండల అధ్యక్షుడు కరీం, మండల అధికారులు, క్రీడా కమిటీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# క్లీన్ అండ్ గ్రీన్ అవార్డు నుంచి గుంతల బస్టాండ్‌గా..

### అధ్వానంగా మారిన కేశవపట్నం బస్టాండ్.. ప్రయాణికులకు తప్పని తిప్పలు





కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 3 ఒకప్పుడు పచ్చదనం, పూల మొక్కలు, పరిశుభ్రతతో కళకళలాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ బస్టాండ్‌గా అవార్డులు అందుకున్న కేశవపట్నం బస్టాండ్ నేడు అధ్వానంగా మారింది. బస్టాండ్ ఆవరణలో అడుగడుగునా గుంతలు ఏర్పడి, వర్షం పడితే నీటితో నిండిపోతున్నాయి. కొన్ని చోట్ల ఇనుప చువ్వలు బయటకు తేలి కనిపిస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.హుజురాబాద్ డిపోకు చెందిన ఈ బస్టాండ్ ఎన్‌హెచ్–563 కరీంనగర్–-వరంగల్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. వీణవంక, సైదాపూర్, తిమ్మాపూర్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడికి వచ్చి బస్సులు ఎక్కి తమ అవసరాల నిమిత్తం వరంగల్, కరీంనగర్ వెళుతుంటారు.కరీంనగర్‌కు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఈ బస్టాండ్ ప్రయాణికులకు కీలకంగా మారింది.కంట్రోలర్ లేక ప్రయాణికులకు ఇబ్బందులుగతంలో బస్టాండ్‌లో కంట్రోలర్ అందుబాటులో ఉండేవారని, ప్రస్తుతం ఆ సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. బస్సుల రాకపోకలు, సమయాలపై సరైన సమాచారం అందక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు.దీనికితోడు ప్రతి సోమవారం జరిగే వారసంతక ఈ బస్టాండ్ కు ఆనుకొని ఉండడంతో వారసంతకు వచ్చే వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలను బస్టాండ్ ఆవరణలో ఇష్టారాజ్యంగా నిలుపుతుండటంతో ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు.గుంతలతో బస్సు డ్రైవర్లకు అవస్థలుబస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో బస్సులు లోపలికి తీసుకురావడానికి డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చినా ఎక్కడ గుంతలో టైరు పడుతుందోనన్న భయంతో బస్సులను నడపాల్సి వస్తోందని చెబుతున్నారు. వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులకు గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు.పచ్చదనం మాయమై.. ఎండిన చెట్లు దర్శనమిస్తుందిఒకప్పుడు పూల మొక్కలు, పచ్చదనంతో ఆహ్లాదకరంగా కనిపించిన బస్టాండ్ ప్రస్తుతం ముళ్లపొదలు, ఎండిపోయిన చెట్లతో దర్శనమిస్తోంది. ఎండిన చెట్లు ప్రమాదకరంగా మారుతున్నా పట్టించుకునే వారు లేరని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్తుతెలియని వాహనాలను సైతం బస్టాండ్ ఆవరణలో ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారని వారు పేర్కొన్నారు.రాబడిపైనే దృష్టి.. సౌకర్యాలు గాలికేనా?బస్టాండ్ నిర్మించి సుమారు 20 సంవత్సరాలు గడుస్తున్నా మౌలిక వసతుల అభివృద్ధిపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ ఎండీ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ హయాంలో క్లీన్ అండ్ గ్రీన్ బస్టాండ్‌గా అవార్డు అందుకున్న కేశవపట్నం బస్టాండ్ నేడు గుంతలు, ముళ్లపొదలతో అధ్వానంగా మారడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, గుంతల పూడ్చివేత, పారిశుధ్య పనులు, పచ్చదనం పునరుద్ధరణతో పాటు వాహనాల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



## సింగరేణిలో స్వచ్ఛత ప్రతిజ్ఞతో పాటు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు



సత్తుపల్లి ఆర్సీ/ అక్టోబర్ 3 సత్తుపల్లి ఏరియాలోని అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, వివిధ విభాగాల్లో నెల రోజుల పాటు స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సింగరేణి అధికారులు తెలిపారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటాచారి ఆదేశాల మేరకు అక్టోబర్ 3 నుంచి అక్టోబర్ 31 వరకు ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా శనివారం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంతో పాటు జేవీఆర్ ఓపెన్‌కాస్ట్, కిష్టారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు, జేవీఆర్ సీహెచ్‌పీ ప్రాంతాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యాలయాలు, గని ప్రాంగణాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంపై ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటాచారి, జనరల్ మేనేజర్‌కు ప్రత్యేక అధికారి బొల్లం శ్రీనివాస్, జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి ప్రహ్లాద్, కిష్టారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి ఏ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ సోమశేఖర్, కిష్టారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ఇంజనీర్ వెంకటేశ్వరరావు, జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ఇంజనీర్ డి. శ్రీనివాసరావు, జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ గని మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు, కిష్టారం ఓపెన్‌కాస్ట్ గని మేనేజర్ బి. రామకృష్ణ, విద్యుత్ మరియు యాంత్రిక విభాగం సీనియర్ అధికారి పి. సాయినాథ్, ఏరియా పర్యావరణ అధికారి ఎం.డి. ఫజల్ రెహమాన్ పాల్గొన్నారు.అలాగే ఆయా ఓపెన్‌కాస్ట్ గనుల్లోని గుర్తింపు పొందిన కార్మిక సంఘాల పిట్ కార్యదర్శులు, ఇతర అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతం చేశారు.



## ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి...



సత్తుపల్లి ఆర్సీ / అక్టోబర్ 3 ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూభాగస్వాములు కావాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లిమండలంనారాయణపురం గ్రామంలో షిర్డీ సాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. క్యాన్సర్‌పైభయపడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రిహాన కమల్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, షిర్డీ సాయి బాబా ట్రస్ట్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## సబ్సిడీపై ఉలవల విత్తనాలు పంపిణీ



పలమనేరు అక్టోబర్3 (:పలమనేరు మండలంలోని పెంగరగుంట రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవసాయాధికారి సంధ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 80 శాతం సబ్సిడీపై ఉలవ విత్తనాలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగినది. పలమనేరు మండలంకు 125 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు కేటాయింపు జరిగినది.10 కిలోల విత్తనం సంచి.... పూర్తి ధర రూపాయలు 740ప్రభుత్వ సబ్సిడీ రూపాయలు 592రైతు వాటా రూపాయలు 148కావున రైతులందరూ తమ ఆధార్ కార్డును ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్ తీసుకుని మీకు నిర్ణయించ తేదీలలో రైతు సేవ కేంద్రంలో ఉలవ విత్తనాలను పొందాలని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు వెంకట ముని రెడ్డి, హరీష్, ప్రజా నాయకులు నాగరాజు రెడ్డి ,అమర్నాథ్ రెడ్డి పెద్దబ్బ,దేవా,స్వతంత్ర బాబు, రామచంద్ర,నక్షత్రయ్య, జయప్రకాష్,నాగరాజు,చలపతి, శ్రీనివాసులురెడ్డి,దామోదర్ రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## చిన్న జలాలపురం ప్రభుత్వ పాఠశాలకు తాగునీరు, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలి



శింగనమల, చిన్న జలాలపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు, విద్యార్థుల భద్రత కోసం పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్కూల్ కమిటీ చైర్మన్ మొండిపోగుల స్వామి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ బండారు శ్రావణి శ్రీకి వినతిపత్రం సమర్పించారు.వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పాఠశాలలోని తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.విద్యార్థుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి స్కూల్ కమిటీ చైర్మన్ మొండిపోగుల స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

## 100 శాతం రాయితీపై వేరుశెనగ విత్తనాల పంపిణీ

రైతుల పెట్టుబడి భారం తగ్గించేందుకు ప్రభుత్వం కీలక సహాయం

రబీ సాగుకు విత్తనాల పంపిణీతో రైతులకు ఊరట

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలి: ఎమ్మెల్యే విజయుడు





ఎర్రవల్లి (ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రబీ 2026--27 సీజన్‌కు 100 శాతం రాయితీపై వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రైతుల పెట్టుబడి భారం తగ్గించేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను అందిస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వేరుశెనగ సాగులో మంచి దిగుబడులు సాధించాలని కోరారు. రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేసిన సర్పంచ్ పసుల కార్తీక్



, జేడీ మల్లంపల్లి అక్టోబర్ 3 మండలంలోని మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పసుల కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారం,పరిశుభ్రత, ఆరోగ్యం,సమతుల్య ఆహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్నారుల విద్య,ఆరోగ్యం,పోషణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతనిప్పుల రఘు,పంచాయతీ కార్యదర్శి మహేందర్,అంగన్వాడీ సూపర్‌వైజర్,అంగన్వాడీ టీచర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం.. అంగన్‌వాడీలో పోషణ మాసం





మల్లంపల్లి, అక్టోబర్ 3 ): మల్లంపల్లి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా శనివారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించి, అక్షరాభ్యాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు తొలి బాటలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, బాలామృతం తదితరాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించడంతో పాటు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, వార్డు సభ్యుడు పాషా, కొంగరి నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్ర చారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, బాలింతలు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల రక్షణకు చెత్త సేకరణ అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



ములుగు, అక్టోబర్ 3 వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ములుగు గట్టమ్మ సమీపంలోని అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో ప్రజలు పడవేసే ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో పడేసే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వన్యప్రాణులు ఆహారంగా తీసుకునే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు అటవీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు అటవీ ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని, వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వాములు కావాలని అటవీశాఖ అధికారులు కోరారు.

# ‘ఎస్పీఆర్ హైస్కూల్’ యాజమాన్యానికి నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి తీవ్ర హెచ్చరిక

45 రోజులు గడిచినా పేరు మార్పు ప్రతిపాదనలు సమర్పించకపోవడంపై ఆగ్రహం

కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తే కరస్పాండెంట్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు:

డీఈవో ఉత్తర్వులు ఆర్టీఐఎస్ఎస్ ఫిర్యాదుతో కదిలిన విద్యాశాఖ -- అధికారిక ప్రొసీడింగ్స్ విడుదల

గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించి మోసపోవద్దు: కేతావత్ బాబురామ్ నాయక్ హెచ్చరిక



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER: NALGONDA

Present: Sri P Susendra Rao, M.Sc.,B.Ed

Rc.No: 1455/B2/2024 Dt:29.09.2026

Sub: School Education – Private Unaided Schools – Court Case- Orders of the Hon'ble Court dated:04.05.2026 in WP No:12250 of 2026 filed by Sri V Sree Pathi Reddy- Non-Submitting the School Name change proposals- Issued Certain instructions.

Ref: 1. G.O.Ms.No: 1 Edn, Dated: 01.01.1994.
2. G.O.Ms.No: 31 Edn, Dated: 27.11.2017.
3. Rc.No: 118/PS1/2024-1, Dt: 05.06.2026 of the Director of School Education, Telangana, Hyderabad.
4. Orders of the Hon'ble High Court dated:04.05.2026 in WP No:12250/2026
5. Proc.Rc.No:3668/A2/2025, dt:21.07.2026 of the RJDSE, Hyderabad
6. This office Proc.Rc.No:1455/B2/2024, Dt:01.08.2026.
7. Representation of Sri K Babu Ram Naik, Founder & National President of RTI Service Society

With reference to the subject cited, Sri K Babu Ram Naik has made representation vide ref. 7th cited, requested to take action on SPR High School, DVK Road, Nalgonda and SPR High School, Kondamallepally as per ref.4th and 5th read above.

In view of the above, the personal attention of Mangament, SPR School, Nalgonda and Kondamallepally is invited to the ref.4th & 5th cited.

Further this office has communicated the said copies, vide ref.6th cited and informed that, M/s Shri Sarvepally Radhakrishna Educational Society may apply, if otherwise eligible, under a different name which does not contain "SPR" as prefix or suffix and does not conflict with the subsisting Court Orders. But M/s Shri Sarvepally Radhakrishna Educational Society has failed to submit the proposals to this office tilltoday.

In view of the above, the management of M/s Shri Sarvepally Radhakrishna Educational Society is once again requested to submit the proposal for change of name which does not contain "SPR" as prefix or suffix immediately along with reasons for non submission of proposals even after lapse of 45 days.

If any deviation, the Correspondent concerned will be held responsible for further legal consequences and necessary proposals will be submitted to the Regional Joint Director of School Education, Hyderabad to take action against the Management as per rules in vogue.

Sd/-P Susendra Rao
District Educational Officer,
Nalgonda.

To
The Correspondent and Secretary, M/s Sarvepally Radhakrishna Educational Society Plot No.88, Sri Laxmi Nagar Gollaguda, Nalgonda-508001
Copy to Sri K Babu Ram Naik, Founder & National President of RTISS, H.No.100, Injapur, Turkayamjal, Rangareddy-501510
Copy to the Mandal Educational Officer, Nalgonda and Kondamallepally
Copy submitted to the Regional Joint Director of School Education, Hyderabad for favour of kind information.
Copy submitted to the Director of School Education, Telangana, Hydearbad for favour of kind information
Copy submitted to the Government Pleader for Services, School Education, Hon'ble High Court, Telangana, Hyderabad for favour of kind information.

//Attested//
Assistant Director
O/o the DEO, Nalgonda



దేవరకొండ: అక్టోబర్ 3(నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డు మరియు కొండమల్లేపల్లిలలో సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ‘ఎస్పీఆర్ హైస్కూల్’ అక్రమ నిర్వహణపై జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) పి. సుశీంద్ర రావు తీవ్రంగా స్పందించారని రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టీఐఎస్ఎస్) వ్యవస్థాపకుడు మరియు జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్ తెలిపారు. ఆర్టీఐఎస్ఎస్ సమర్పించిన సమగ్ర ఆధారాలు, వినతిపత్రాల ఆధారంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం అధికారిక ప్రొసీడింగ్స్ (ఆర్సీ నెంబరు: 1455/బి2/2024, తేదీ: 29.09.2026) జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాబురామ్ నాయక్ మాట్లాడుతూ... గౌరవ తెలంగాణ హైకోర్టు తీర్పు (రిట్ పిటిషన్ నెంబరు: 12250/2026), రంగారెడ్డి జిల్లా వాణిజ్య న్యాయస్థానం (కమర్షియల్ కోర్టు) శాశ్వత నిషేధాజ్ఞలు (ఇంజంక్షన్ ఉత్తర్వులు) మరియు పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకుల (ఆర్జేడీఎస్ఈ - హైదరాబాద్) ఆదేశాల ప్రకారం ‘ఎస్పీఆర్’ అనే పేరును ఉపయోగించకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయని గుర్తుచేశారు. సదరు పాఠశాల యాజమాన్యం ‘ఎస్పీఆర్’ పదం లేకుండా నూతన పేరు మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ ఆదేశించినప్పటికీ, 45 రోజుల చట్టబద్ధమైన గడువు ముగిసినా ఎలాంటి ప్రతిపాదనలు సమర్పించకుండా యాజమాన్యం ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం వహించిందని జిల్లా విద్యాశాఖాధికారి తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఇప్పటికైనా ‘ఎస్పీఆర్’ అనే పేరు వాడకుండా తక్షణమే పేరు మార్పు ప్రతిపాదనలు పంపాలని, అలా చేయని పక్షంలో తలెత్తే తీవ్ర చట్టపరమైన పరిణామాలకు కరస్పాండెంట్ వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని మరియు పాఠశాల గుర్తింపు రద్దు కోసం ఆర్జేడీఎస్ఈ హైదరాబాద్ కార్యాలయానికి తదుపరి నివేదిక పంపుతామని డీఈవో ప్రొసీడింగ్స్‌లో గట్టిగా హెచ్చరించినట్లు ఆయన వెల్లడించారు. అనధికార పాఠశాలను తక్షణమే సీజ్ చేసి మూసివేయాలి:విద్యాశాఖ నుండి నూతన పేరుతో అధికారిక అనుమతులు లేకుండా, న్యాయస్థానాల ఆదేశాలను ఉల్లంఘిస్తూ పాఠశాల తరగతులు నడపడం మరియు కొత్త విద్యార్థుల ప్రవేశాలు (అడ్మిషన్లు) చేపట్టడం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ చట్టం - 2009) ప్రకారం తీవ్రమైన చట్టవిరుద్ధ చర్య అని బాబురామ్ నాయక్ స్పష్టం చేశారు. వీటికి తోడు కొండమల్లేపల్లి క్యాంపస్ స్థానిక చెరువు యొక్క పూర్తి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) / బఫర్ జోన్ ముంపు ప్రాంతంలో అక్రమంగా నిర్మించబడిందని, కనీస అగ్నిమాపక రక్షణ (ఫైర్ ఎన్‌ఓసీ) అనుమతులు లేకుండా ప్రమాదకరంగా అక్రమ బాలుర హాస్టల్‌ను నడుపుతున్నారని ఆరోపించారు. ?తల్లిదండ్రులు ఇలాంటి వివాదాస్పద మరియు గుర్తింపు లేని సంస్థలలో పిల్లలను చేర్పించి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న పాఠశాల ప్రాంగణాలను, అక్రమ హాస్టల్‌ను తక్షణమే అధికారులు భౌతికంగా సీజ్ చేసి మూసివేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం సెక్షన్ 18(5) నిబంధనల ప్రకారం ఉల్లంఘన జరిగిన ప్రతి రోజుకు పది వేల రూపాయల (?10,000) చొప్పున లెక్కించి పూర్తి జరిమానా వసూలు చేయాలని, తప్పుడు ప్రచారాలతో తల్లిదండ్రులను మోసగించిన కరస్పాండెంట్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318(4) కింద క్రిమినల్ చీటింగ్ కేసు నమోదు చేయాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌ను కలిసి, హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ (కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్) దాఖలు చేస్తామని హెచ్చరించారు.

## బతుకమ్మకు ముస్తాబవుతున్న మల్లంపల్లి.. పారిశుధ్య పనులకు సర్పంచ్ శ్రీకారం

పండుగ వేళ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు



మల్లంపల్లి, అక్టోబర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మల్లంపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణానికి అనుగుణంగా పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యలను పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తొలగించే పనులను సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు పాలకవర్గ సభ్యులతో కలిసి స్వయంగా పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, కారోబార్ రమేష్, వార్డు సభ్యులు సిహెచ్ మహేందర్, పాషా, జింక వేణు, దయ్యాల చంద్రమౌళి, కొంగరి నరేందర్, కూచన సురేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి ప్రభావిత గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

పనిచేయని ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయాలి -- కమ్యూనిటీ హాళ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలి



సత్తుపల్లి ఆర్సి / అక్టోబర్ 3:సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సత్తుపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సమావేశం మండల అధ్యక్షురాలు పిల్లి నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్లు అనేక చోట్ల పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనిచేయని ఆర్వో ప్లాంట్లను వెంటనే మరమ్మతులు చేయించి, ప్రజలకు నిరంతరం శుద్ధి చేసిన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను ప్రజల అవసరాలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పలు గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయి నిరుపయోగంగా మారాయని, వాటికి అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి ప్రభావిత గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికిపోగు సర్వేశ్వరరావు, అయినంపూడి సనందరావు, బండి వేలాద్రి, తడికమళ్ల రామకృష్ణ, బెజవాడ లక్ష్మీనారాయణ, మల్లాది వెంకట్, ఎలగం రాములు, సప్పిడి భాస్కర్, పరమేష్, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 5న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి ఆదివాసీల హక్కులు, జీఓల సాధన కోసం మహాధర్నా

ఆదివాసీ సంఘాల ఐక్యచరణ కమిటీ పిలుపు



అశ్వరావుపేట ఆర్సి / అక్టోబర్ ): ఆదివాసీల హక్కుల సాధన, పెండింగ్‌లో ఉన్న జీఓల అమలు, ఐదో షెడ్యూల్ భూభాగ పరిరక్షణ, ఆదివాసీల జాతి అస్తిత్వం కోసం అక్టోబర్ 5న కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నా, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్యచరణ కమిటీ పిలుపునిచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలు గ్రామ గ్రామం నుంచి స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా గత వారం రోజులుగా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ గ్రామ పెద్దలు, సర్పంచులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ రాజకీయ ప్రతినిధులను కలిసి కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆదివాసీల హక్కులు, ఐదో షెడ్యూల్ ప్రాంతాల పరిరక్షణ, జీఓల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాధర్నాకు ఆదివాసీ సమాజం పెద్ద ఎత్తున తరలిరావాలని కమిటీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు కొర్సా వెంకటేష్ దొర, తెల్లం రామారావు దొర, కుంజా చిన్నబాబు, పాశం ప్రసాద్, కొర్సా వీదరాజు, తాటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ గెలల అక్రమ రవాణా ముఠా అరెస్ట్

9 మంది అరెస్ట్.. రెండు ఆటోలు, పామాయిల్ గెలలు, నగదు స్వాధీనం

మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు




అశ్వరావుపేట ఆర్సి / అక్టోబర్ 3 పామాయిల్ గెలలను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న ముఠాపై దమ్మపేట పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి, రెండు ఆటోలు, పామాయిల్ గెలలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు చేపట్టిన దర్యాప్తులో పామాయిల్ గెలల అక్రమ తరలింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లారీలు, ట్రాక్టర్ల ద్వారా పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలకు తరలించే సమయంలోయజమానులకు తెలియకుండా కొంత మొత్తంలో గెలలను మార్గమధ్యంలో దించి అక్రమంగావిక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గత నాలుగు నెలలుగా బుగ్గపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బత్తిన రాము, ట్రాక్టర్ డ్రైవర్లు గడ్డం మహేంద్ర, కీసరి నాగరాజు, నాగబాబు తదితరులు వివిధ గ్రామాల నుంచి అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు గెలలను తరలించే క్రమంలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అలాగే కనితి లక్ష్మీనారాయణ అక్రమంగా సేకరించిన పామాయిల్ గెలలను కనితి శివ, వంక చందు తమ ఆటోల ద్వారా తరలించడంలో సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పొట్ట ముత్యాలరావుతో పాటు మరికొందరిప్రమేయంపైనా దర్యాప్తుకొనసాగుతోంది. జక్కా బాలు,కారంవెంకటేష్, చి. పుల్లారావు తమ ఎఫ్–కోడ్లను ఉపయోగించి పామాయిల్ గెలల విక్రయాలకు సహకరించడంతో పాటు నగదు లావాదేవీల్లో భాగస్వాములైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితులు పరస్పర సమన్వయంతో పామాయిల్ గెలలను అక్రమంగా తరలించి విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, రెండు ఆటోలు, పామాయిల్ గెలలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు. పామాయిల్ గెలల దొంగతనం, అక్రమ రవాణా, ఎఫ్–కోడ్ల దుర్వినియోగానికి పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. కేసు దర్యాప్తులో అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు, దమ్మపేట ఎస్ఐ బాలస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యలంక బాపట్ల మురిసిపాలిటీ లో వినీలం కావడం వలన బాపట్లకు మహర్దశ

బాపట్ల అక్టోబరు 03 య శివారు గ్రామాల విలీనం పై వేసిన పిటిషన్ ను హై కోర్టు కొట్టివేయడం వలన



సూర్యలంక బాపట్ల మున్సిపాలిటీ లో భాగం కావడం హర్షణీయమని బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ అన్నారు. పిటిషన్లు వేసిన వారితో స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ చర్చించి ఉపసంహరించుకునేలా చేయడం అభినందనీయమన్నారు. తరతరాలుగా సూర్యలంక తీరంలో బాపట్ల ప్రజల అనుబంధం చెరిగిపోనిదని, బాపట్ల ప్రజల భావోద్వేగాలతో ముడిపడివున్న ఈ తీరం బాపట్ల పట్టణం నుండి వేరుపడిన భావన హై కోర్టు ఇచ్చిన తీర్పుతో తొలగిపోతుందన్నారు. కేంద్ర నిధులతో అభివృద్ధి చెందుతున్న సూర్యలంక బీచ్ బాపట్ల మునిసిపాలిటీల్లో భాగం కావడం వలన బాపట్లకున్న బ్రాండ్ నేమ్ ప్రపంచవ్యాప్తమవుతుందని, ముఖ్యంగా ప్రపంచ పర్యాటక రంగంలో బాపట్ల మ్యాప్ ఆవిష్కృతమవుతుందని తద్వారా సూర్యలంక బీచ్ బాపట్ల బీచ్ గా ప్రసిద్ధి చెందుతుందన్నారు. 1400 సంవత్సరాలుగా విద్య సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లుతున్న బాపట్ల ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు ఇది ఒక సువర్ణావకాశమన్నారు. ఈ సందర్భంగా 11 శివారు గ్రామాల విలీనానికి కృషి చేసి బాపట్ల మునిసిపాలిటీ పరిధిని పెంచిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు, సహకరించిన ఆ యా గ్రామాల ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

## అభిజీత్ దీప్కేను కలిసిన నటుడు నసీరుద్దీన్ షా



ముంబై: ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా శుక్రవారం ముంబైలోని ఆజాద్ పార్క్‌లో కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను కలిశారు. నసీరుద్దీన్ షా చూడగానే అభిజీత్ సంతోషం వ్యక్తం చేశారు. శిరసు వంచి ఆయనకు స్వాగతం పలికాడు. 'నేను మీకు పెద్ద అభిమానిని' అని చెప్పగానే.. అతడిని నసిరుద్దీన్ షా ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. దేశ ప్రజల కోసం పోరాడుతున్న అభిజీత్‌ను అభినందించారు. 'నేనే నీకు పెద్ద అభిమానిని' అంటూ అభిజీత్‌ను మెచ్చుకున్నారు. ఈ మధుర క్షణాలకు సంబంధించిన వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు అభిజీత్ దీప్కే. కాగా, ఇంతకుముందు జూలైలో ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి నసీరుద్దీన్ షా సంఘీభావం ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ ఈరోజు శివాజీ పార్క్ గేట్ నంబరు 6 వద్ద నిరసన కార్యక్రమం చేపట్టింది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. సీజేపీ నిరసన కార్యక్రమానికి సినిమా పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సంఘీభావం ప్రకటించారు. ప్రకాశ్‌రాజ్, కిశోర్, జైన్ మేరీ ఖాన్, విశాల్ దద్లానీ.. సీజేపీకి మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. సీజేపీ ఆందోళన నేపథ్యంలో శివాజీ పార్క్ వద్దకు భారీగా జనం చేరుకున్నారు. మరోవైపు Gogyanugo హాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతోంది.

## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం.. బొలెరో, ట్రక్కు ఢీ.. ఏడుగురు మృతి!




మహారాష్ట్ర: ధర్మాంగాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొలేరో వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందారు. మరో 21 మందికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ధర్మాంగాన్ వద్ద ప్రయాణికులతో వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఓ ట్రక్కు ప్రమాదవశాత్తు ఒక్కసారిగా ఢీకొట్టింది. దీంతో బొలేరోలో ప్రయాణిస్తున్న వారిలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరికి తీవ్ర గాయాలైనట్లుగా తెలుస్తోంది. అయితే, స్థానికులు క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్లుగా తెలుస్తోంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు మృతుల వివరాలను సేకరించే పనిలో ఉన్నారు. అయితే ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కరువు వేళ ఈవెంట్లు కాదు.. రైతులను ఆదుకోండి..




తాడేపల్లి: రాయలసీమ తీవ్ర కరువుతో అల్లాడుతుంటే చంద్రబాబు ఈవెంట్లతో కాలం గడుపుతున్నారని.. 'రైజింగ్ రాయలసీమ' ఈవెంట్లు ఎవరి కోసం? అంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రైతుకు కావాల్సింది ఈవెంట్లు, పబ్లిసిటీ కాదు.. కష్టకాలంలో ప్రభుత్వ భరోసా. రైతులకు తక్షణమే రుణాల రీ షెడ్యూల్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందించాలి" అని డిమాండ్ చేశారు. "కేవలం 388 మండలాలకే కరువు పరిమితం చేయడం అన్యాయం. వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హమైన అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి. జూన్ నుంచే వర్షాభావ పరిస్థితులు ఉన్నా సెప్టెంబరు చివరి వరకు కరువు ప్రణాళిక ఎందుకు సిద్ధం చేయలేదు?. వేల ఎకరాల్లో చీనీ సహా పండ్ల తోటలు ఎండిపోతున్నాయి. రైతులు లక్షలు ఖర్చుపెట్టి కొత్త బోర్లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. టమోటా, అరటి, బత్తాయి, ఉల్లి రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. ఈ రెండేళ్లలో ఉద్యాన రంగానికి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి" అంటూ కన్నబాబు నిలదీశారు. "వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంటే ఇప్పుడు 'హబ్‌లు ఏర్పాటు చేస్తాం' అంటూ కొత్త ప్రకటనలు చేయడం వల్ల రైతుకు తక్షణ ప్రయోజనం ఏమిటి?. గతంలో అనేక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని ప్రచారం చేశారు. ప్రకటించిన వాటిలో ఎన్ని ప్రాజెక్టులు వాస్తవంగా గ్రౌండ్ అయ్యాయో ప్రభుత్వం చెప్పాలి. చంద్రబాబును 'వాటర్ మ్యాన్' అని పొగిడే వారు ఒక్కసారి రాయలసీమలో ఎండిపోయిన పొలాలు, రైతుల కష్టాలను చూడాలి. విశాఖకు తన ప్రార్థనల వల్లే వర్షం వచ్చిందని చంద్రబాబు చెప్పుకున్నారు. అదే నిజమైతే నాలుగు నెలల ముందే ప్రార్థించి కరువును ఎందుకు నివారించలేకపోయారు?" అంటూ కన్నబాబు ప్రశ్నించారు. "ఇప్పుడు 'రోడ్డు డాక్టర్లు' అంటున్నారు.. ముందు 'కరువు డాక్టర్లను' తీసుకొచ్చి రైతులను దుర్భిక్షం నుంచి బయటపడేయండి. ఈవెంట్లతో కరువు పోదు.. పబ్లిసిటీతో రైతు కష్టాలు తీరవు. 'రైజింగ్ రాయలసీమ' అని పేరు పెట్టడం కాదు.. కరువుతో కుంగిపోతున్న రాయలసీమ రైతును కాపాడండి" అని కన్నబాబు హితవు పలికారు. "మదనపల్లెలో సీఎం చంద్రబాబు మొదలుకాని సినిమాకే విజయోత్సవ సభ నిర్వహించారు. ప్రచారం తప్ప పని చేయకుండా తనకు తానే డబ్బా కొట్టుకోవడం ఒక్క చంద్రబాబుకే సాధ్యం. మదనపల్లెలో ప్రకటించింది లక్ష కోట్ల హార్టికల్చర్ హబ్ కాదు... లక్ష అబద్ధాల ప్రభుత్వం. పంటలు, తోటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే హార్టికల్చర్ హబ్ పేరిట సంబరాలు జరుపుతారా?. వ్యవసాయాన్ని గబ్బు పట్టించి, ఇప్పుడు హబ్‌లంటూ సరికొత్త విన్యాసాలు చేస్తున్నారు. ..గతంలో అమరావతికి హైపర్‌లూప్, బుల్లెట్ ట్రైన్, మెట్రో, సీ-ప్లేన్ అన్నట్లే ఇదీ ఒక పిట్టల దొర కథ. లాక్‌హీడ్ ప్లాంట్, సౌదీ అరాంకో, ఎయిర్‌బస్, అలీబాబా డేటా సెంటర్ తరహాలోనే ఈ హబ్ ప్రచారం కూడా గాల్లో కలిసిపోతుంది. రోజూ మాటలు, ఈవెంట్లతో ప్రజలను మభ్యపెట్టడమే కూటమి ప్రభుత్వ నైజం. 2026-27 బడ్జెట్‌లో హార్టికల్చర్ శాఖకు కేటాయించింది కేవలం రూ. 1,123 కోట్లే. లక్ష కోట్ల ప్రాజెక్టు అని ప్రచారం చేసుకుంటున్న హబ్‌కు బడ్జెట్‌లో పెట్టింది కేవలం రూ. 200 కోట్లా?. హబ్‌లో రూ. 60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులు ఎవరు పెడుతున్నారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి" కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు.

## క్రీడాకారిణి బొల్లు లిఖితకు వైఎస్ జగన్ అభినందనలు



తాడేపల్లి: క్రీడాకారిణి బొల్లు లిఖితకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలవటంపై హర్షం వ్యక్తం చేశారు. గుంటూరుకు చెందిన లిఖిత అంతర్జాతీయ వేదికపై సత్తా చాటటం.. దేశానికి బంగారు పతకం అందించడం గర్వకారణం" అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. లిఖిత విజయానికి అండగా నిలిచిన ఆమె కుటుంబ సభ్యులు, కోచ్‌ల ప్రోత్సాహం అభినందనీయం. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి.. దేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# విటమిన్-డి లోపిస్తే గుండెకు ముప్పే

### విటమిన్ తక్కువైతే గుండె రక్షణ వ్యవస్థ అస్తవ్యస్తం

### కణాల స్థాయిలోనే నష్టం జరుగుతోందని గుర్తింపు

### ఎన్ఐఎన్ పరిశోధనలో వెల్లడి



సాధారణంగా ఎముకల బలానికి, గట్టితనానికి విటమిన్--డి కావాలని అందరికీ తెలుసు. అయితే శరీరంలో విటమిన్--డి తక్కువగా ఉంటే, అది నేరుగా గుండె ఆరోగ్యాన్ని కణాల స్థాయిలో దెబ్బతీస్తుందని తేలింది. ఈ విటమిన్ స్థాయిలు తగినంతగా లేకపోవడం వల్ల గుండెను కాపాడే సహజ రక్షణ వ్యవస్థ పూర్తిగా పాడైపోతుందని హైదరాబాద్‌కు చెందిన భారతీయ వైద్య పరిశోధన మండలి--జాతీయ పోషకాహార సంస్థ (ఐసీఎంఆర్--ఎన్ఐఎన్) శాస్త్రవేత్తలు తమ పరిశోధన ద్వారా కనుగొన్నారు. విటమిన్--డి తగినంత లేకపోతే గుండె కణాల్లో హానికరమైన ఒత్తిడి పెరిగిపోయి, అవి దెబ్బతినడమే కాకుండా కణాలు అకాలంగా చనిపోయే ప్రమాదం కూడా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ వివరాలు స్టెరాయిడ్స్ అనే ప్రముఖ అంతర్జాతీయ పత్రికలో ప్రచురితమయ్యాయి.

### పరిశోధన ఇలా..

శాస్త్రవేత్తలు ఈ పరిశోధన కోసం ల్యాబ్‌లో ఎలుకలపై రకరకాల ప్రయోగాలు చేశారు. సాధారణ ఆహారం తీసుకునే, తక్కువ విటమిన్--డి ఉన్న ఆహారం తీసుకునే, అలాగే, విటమిన్--డి పూర్తిగా లేని ఆహారం తీసుకునే ఎలుకల గుండెల్లో జరుగుతున్న మార్పులను చాలారోజుల పాటు గమనించారు. దీనితోపాటు ప్రయోగశాలలో ప్రత్యేకంగా పెంచిన గుండె కణాలపైనా పరిశోధనలు జరిపారు. విటమిన్--డి లోపించిన ఆహారాన్ని తీసుకున్న ఎలుకల గుండెల్లో చెడు ఒత్తిడి, ఆక్సీకరణ నష్టం చాలా ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. మన శరీరంలో కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించే 'గ్లుటాథియోన్' అనే ముఖ్యమైన రసాయన నిల్వలు వాటిలో పూర్తిగా అడుగంటాయి. గుండెను కాపాడే ఇతర రక్షణ ఎంజైముల పనితీరు కూడా బాగా తగ్గిపోయింది. కణాలను ఒత్తిడి నుండి కాపాడే ప్రధాన అంతర్గత రక్షణ మార్గమైన 'ఎన్ఆర్ఎఫ్--2' కూడా ఈ విటమిన్--డి లోపం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నట్లు పరిశోధకులు నిరూపించారు.

### ఒత్తిడిని తట్టుకుని సురక్షితంగా...

శరీరంలో విటమిన్--డి తగినంతగా లేకపోవడం వల్ల సుదీర్ఘకాలం పాటు కొనసాగే ఒత్తిడి కారణంగా గుండె కణాలపై భారం పెరిగిపోతుందని ఈ పరిశోధనా బృందానికి నాయకత్వం వహించిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆయేషా ఇస్మాయిల్ చెప్పారు. దీనివల్ల కణాలు తీవ్రంగా గాయపడతాయని, కణాలు తమను తాము నాశనం చేసుకునే ప్రక్రియ మొదలవుతుందని వివరించారు. అయితే గుండె కణాలకు ముందే విటమిన్--డి అందించినప్పుడు, అవి ఆ ఒత్తిడిని తట్టుకుని చనిపోకుండా సురక్షితంగా ఉన్నట్లు ల్యాబ్‌లో రుజువైందని తెలిపారు. శరీరంలో తగినంత మోతాదులో విటమిన్--డి ఉండటం వల్ల గుండె కణాలు ఒత్తిడి పరిస్థితులను సమర్థవంతంగా తట్టుకోగలవని ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి పేర్కొన్నారు.

# మళ్లీ ఉన్మాద ఛాయలు!

కొన్ని హఠాత్సంఘటనలు అరుదైన వ్యక్తులనూ, మనుషుల్లోని అసాధారణతనూ ప్రపంచం ముందు ఆవిష్కరిస్తాయి. బుధవారం ఒక దుండగుడి హైజాక్ యత్నంలో చిక్కుబడి, ప్రమాదపుటంచుల్లోపడిన ఫ్లై దుబాయ్ విమానం తిరిగి నిలదొక్కుకున్న ఉదంతంలో ఆ విమానం పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ పేరు ఇప్పుడు ప్రపంచం మూలమూలనా మార్మోగటానికి ఆయన ప్రదర్శించిన తెగువ, సాహసాలే కారణం. కో కెప్టెన్ దాడితో శరీరంనిండా కత్తిపోట్లున్నా, నెత్తురోడుతూ అపస్మారకంలోకి పోతున్నా కెప్టెన్ మచ్చర్ ఏమాత్రం జంకక సమయస్ఫూర్తితో, విమానాన్ని రక్షించి తీరాలన్న పట్టుదలతో కాక్‌పిట్ తలుపు లాక్ తెరవడం చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే సన్నివేశం. ఆయన స్ఫూర్తిదాయక వ్యవహారశైలి దేశదేశాల్లోని పైలెట్లకు, మొత్తం విమానయాన సిబ్బందికి భవిష్యత్తులో ఒక అధ్యయనాంశంగా మారుతుంది. సరిగ్గా పాతికేళ్లనాడు అమెరికాలో నాలుగు విమానాల్ని దారిమళ్లించి కూల్చివేసి, వేలాదిమంది మరణానికి కారణమైన ఉగ్రవాద ఉన్మాదంనుంచి ప్రపంచ దేశాలింకా సరైన గుణపాఠం నేర్చుకోలేదని ఈ హైజాక్ యత్నం రుజువుచేసింది. అది ఆత్మాహుతి దాడా... మరేదైనానా అన్నది తేల్చాల్సివున్నదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో సహా పలువురు చెబుతున్నా, దీనివెనక ఇరాన్ హస్తమున్నదని బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ ఆరోపిస్తున్నారు. ఈ దుండగానికి కారకుడైన కో పైలెట్ ఒమన్ జాతీయుడు. 174 మంది ప్రయాణిస్తున్న ఆ విమానం ఎన్నో అవాంతరాలెదురైనా చివరకు సురక్షితంగా సౌదీ అరేబియాలో అడుగుపెట్టింది. కెప్టెన్ మచ్చర్‌పై కో పైలెట్ దాడి,వారి పెనుగులాట... అనుకోకుండా కాక్‌పిట్ తలుపు లాక్ తెరుచుకోవడం వంటి వరస పరిణామాలు అందులో ప్రయాణిస్తున్న వారందరినీ దిగ్భ్రాంతిలో పడేశాయి. ఈమధ్యలోనే విమానం నియంత్రణ కోల్పోయి నిమిషంలోపే 34,000 అడుగుల ఎత్తునుంచి 17,000 అడుగులకు పడిపోవటంతో ప్రయాణికులంతా ప్రాణభయంతో కేకలు వేయటం వీడియోలో రికార్డయింది. మరో 2,000 అడుగుల కిందకు జారాక అది మళ్లీ క్రమేపీ గాల్లోకి లేవడం ఒకరకంగా అదృష్టమని




చెప్పాలి. ప్రయాణికుల్లో కొందరు చొరవగా లోపలికెళ్లి జరిగిందేమిటో గ్రహించి కోపైలెట్‌ను అదుపు చేయటం, ప్రయాణికుల్లో ఒకరైన డెంటిస్టు రక్తస్రావం కాకుండా కెప్టెన్‌ను కాపాడటం ప్రశంసించ దగ్గ పనులు. ఇంకా ఆశ్చర్యకరమైన సంగతేమంటే... అనుకోకుండా ఆ విమానంలో రిలీఫ్ పైలెట్లు ఉండటం. అత్యవసర సమయంలో విమానం నడపాల్సిన కో పైలెటే నేరగాడు కావటం, పైలెట్‌కు స్పృహ లేకుండా పోవడం వంటి పరిణామాల మధ్య ఆ రిలీఫ్ పైలెట్లు లేకుంటే ఏం జరిగివుండేదో ఊహించుకుంటేనే వణుకొస్తుంది. అమెరికాలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పైలెట్ లేదా కో పైలెట్ కోరుకుంటే తప్ప కాక్‌పిట్ తలుపు తెరుచుకోకుండా విమానాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బయటినుంచి తెరిచే ప్రయత్నం దుర్లభమయ్యేంత పటిష్టంగా ఆ తలుపుంటుంది. హైజాక్ యత్నం, బెదిరింపులు వంటివి క్యాబిన్‌లో మాత్రమే జరుగుతాయనీ,కాక్‌పిట్ సురక్షితంగా ఉండేలా చూస్తే సరిపోతుందనీ ఈ సాంకేతికత తీసుకొచ్చారు. కానీ తాజా ఉదంతంలో ప్రమాదం క్యాబిన్‌లో కాకుండా, కాక్‌పిట్‌లోనే పొంచివుండటం గమనించదగ్గది. వీటి సంగతలావుంచి అసలు దుబాయ్‌లో కో పైలెట్ చాకుతో విధులకు ఎలా రాగలిగాడు? అంటే భద్రత విషయంలో మునుపటి అప్రమత్తత సన్నగిల్లిందన్నమాట! నిత్యం వేలాదిమంది ప్రయాణించే దుబాయ్ విమానాశ్రయంలో ఇలాంటి భద్రతాపరమైన లోపం చోటుచేసుకోవటం ఊహకందనిది. ప్రపంచం కక్షలు, కార్పణ్యాలతో భయానకంగా మారింది. ఇప్పుడు జరిగిన ఉదంతానికి పురిగొల్పిన పరిణామాలేమిటన్నది ఇంకా తెలియాల్సే వున్నా ఇజ్రాయెల్ గాజాలో సాగిస్తున్న మారణకాండకు ప్రతీకారంగా కో పైలెట్ ఆ దేశ పౌరులు అధికంగా వున్న విమానాన్ని కూల్చేయదల్చుకున్నాడన్న కథనాలు వెలువడుతున్నాయి. 'కంటికి కన్ను...' సిద్ధాంతం మనిషిని ఉన్మాదిగా మారుస్తుంది. సహేతుక పోరాటాలపై నీలినీడలు కమ్మేలా చేస్తుంది. ఒక ఉన్మాదానికి మరో ఉన్మాదం ఎప్పటికీ జవాబు కాదు.

## ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో ఇరాన్ హస్తం?.. వెలుగులోకి ఆధారాలు?




టెల్ అవీవ్: దుబాయ్ నుండి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం ఘటనలో విస్తుపోయే నిజాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. భారతీయ పైలట్‌పై కత్తితో దాడి చేసి విమానాన్ని కూల్చేందుకు యత్నించిన ఒమన్ కో-పైలట్‌కు సంబంధించిన మరిన్ని సంచలన వివరాలను ఇజ్రాయెల్ మీడియా, అధికారులు బయటపెట్టారు. నిందితుడు తన సోషల్ మీడియా ఖాతాలలో యూదులను చంపడం గురించి తరచూ చర్చించాడని ఓ ఇజ్రాయెల్ అధికారి 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్'తో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఒమన్ జాతీయుడు పూర్తిగా ఇస్లామిస్ట్ ఉగ్రవాద భావజాలానికి బానిసయ్యాడని, అతని సోషల్ మీడియా పోస్టులే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

### కరపత్రాల్లో ఏముందంటే?

ఎమిరేట్స్ వర్గాలను ఉటంకిస్తూ 'ఐ24న్యూస్' జర్నలిస్ట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితుడైన కో-పైలట్ లగేజీలో 'ఫ్రీ పాలస్తీనా' గ్రూపులకు సంబంధించిన కరపత్రాలు, ప్రచురణలు, ఇతర పాలస్తీనా అనుకూల సామగ్రి లభించాయి. ఆ పైలట్ పదేపదే పాలస్తీనియన్లకు మద్దతు తెలుపుతూ, ఇజ్రాయెల్ పట్ల తీవ్రమైన శత్రుత్వాన్ని వ్యక్తం చేశాడని ఆ మూలం తెలిపింది. కో-పైలట్ ఇస్లామిక్ తీవ్రవాద భావజాలం, ఉగ్రవాద ఉద్దేశ్యాల కోణంలో ఈ ఆధారాలు కీలకంగా మారాయి.

### నన్ను చంపండి.. నన్ను చంపండి

ప్రయాణికులు, సిబ్బంది కలిసి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కట్టేసిన తర్వాత, అతను విమాన సిబ్బందిని ఉద్దేశించి 'నన్ను చంపండి.. నన్ను చంపండి' అంటూ అరిచాడని అధికారులు తెలిపారు. ఇతను ఆత్మహత్య చేసుకోవడానికి, విమానంతో సహా కుప్ప కూలిపోవడానికి పక్కా ప్రణాళికతో వచ్చినట్లు స్పష్టమవుతోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు 'ఫాక్స్ న్యూస్'తో అన్నారు. అక్కడ ఉన్న ప్రయాణికుల భద్రత, నిందితుడి ఇస్లామిస్ట్ ధోరణులు, తీవ్రవాద భావజాలం, దొరికిన కరపత్రాలను పరిగణనలోకి తీసుకుంటే ఇదొక ఉగ్రవాద యత్నంగా భావించడానికి తగిన ఆధారాలున్నాయని నెతన్యాహు పేర్కొన్నారు. అయితే, దర్యాప్తు పూర్తిగా ముగిసే వరకు తుది ఉద్దేశంపై కచ్చితమైన నిర్ధారణకు రాలేమని, సౌదీ అరేబియా, యూఏఈ, ఇజ్రాయెల్ దర్యాప్తు బృందాలు సంయుక్తంగా విచారణ జరుపుతున్నాయని అధికారులు వెల్లడించారు.

### ఎఫ్‌జెడ్ 1073 విమానంలో ఏం జరిగింది?

ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 యూఏఈలోని దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇజ్రాయెల్ మెట్రో నగరం టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. ప్రయాణం ప్రారంభమైన సుమారు రెండున్నర గంటల తర్వాత, ఒమన్ జాతీయుడైన కో-పైలట్ అకస్మాత్తుగా విమానాన్ని హైజాక్ చేసి కూల్చేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కాక్‌పిట్‌లో ఆపత్కాలంలో సిబ్బంది వినియోగించే క్రాష్ యాక్స్‌తో భారతీయ సంతతి పైలట్ స్మిత్ మచ్చార్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ పెనుగులాట కారణంగా విమానం ఒక్కసారిగా 33 వేల అడుగుల క్రూయిజింగ్ ఎత్తు నుంచి దాదాపు 16,600 అడుగుల ఎత్తు వరకు (17 వేల అడుగులకు పైగా) కుప్పకూలినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా స్పష్టం చేసింది.

### ప్రాణాలకు తెగించి.. సురక్షిత ల్యాండింగ్

ఈ ప్రమాదకర సమయంలో తీవ్ర గాయాలనప్పటికి, కెప్టెన్ స్మిత్ మచ్చర్ వెనకడుగు వేయలేదు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించి కాక్‌పిట్ డోర్ తెరిచి విమానాన్ని అదుపులోకి తెచ్చేందుకు పోరాడారు.ఇంతలో అప్రమత్తమైన సిబ్బంది, ప్రయాణికులు వెంటనే కాక్‌పిట్‌లోకి చొచ్చుకెళ్లి దాడి చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకుని కట్టేశారు. ఆ తర్వాత కెప్టెన్ మచ్చార్ సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు.

# ఇంట్లో అగ్నిప్రమాదం.. ఎమ్మెల్యేకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా ధులియాన్‌లో శనివారం ఉదయం సాగర్‌దిఘి నియోజకవర్గ ఎమ్మెల్యే బైరన్ బిశ్వాస్ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే బైరన్ బిశ్వాస్ గాయపడ్డారు. మంటల కారణంగా ఆయన శరీర దిగువ భాగంలో కాలిన గాయాలు కనపడినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో కుటుంబంలోని ఇతర సభ్యులు ఇంట్లో ఉన్నప్పటికీ ఎవరికీ గాయాలు కాలేదు. ఇంటి నుంచి భారీగా నల్లటి పొగ వెలువడటాన్ని స్థానికులు గమనించారు. గాయపడిన బైరన్ బిశ్వాస్‌ను తొలుత ధులియాన్‌లోని కుటుంబానికి చెందిన నర్సింగ్‌హోమ్‌కు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ముర్షిదాబాద్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించే అవకాశం ఉందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అగ్నిప్రమాదం ఎలా మొదలైంది, బైరన్ బిశ్వాస్‌కు ఏ విధంగా గాయాలు అయ్యాయన్నది ఇప్పటివరకు స్పష్టంగా తెలియలేదని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. బైరన్ బిశ్వాస్ ఇటీవల రాజకీయ పరిణామాల కారణంగా కూడా వార్తల్లో నిలిచారు. ఆయన రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు ఆయన ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఈ ఘటనపై స్పందిస్తూ.. "నేను తెలుసుకుంటాను. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను" అని మీడియాతో అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి స్పందిస్తూ.. "నేను చాలా ఆందోళన చెందుతున్నాను. ఆసుపత్రికి వెళ్తాను. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తాను" అని తెలిపారు. ప్రస్తుతం బైరన్ బిశ్వాస్ ఆరోగ్య పరిస్థితిపైనే ప్రధానంగా దృష్టి ఉంది. అదే సమయంలో అగ్నిప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని నిర్ధారించాల్సి ఉంది.

# 'ఆమ్ ఆద్మీ'కి షాక్: కాంగ్రెస్‌లో చేరిన ప్రియాంక కక్కర్



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ప్రధాన జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు రాజీవ్ శుక్లా, పవన్ ఖేడా, దేవేందర్ యాదవ్ సమక్షంలో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే శ్యామ్ సుందర్ శర్మ, రజత్ రాకేశ్ టండన్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, తాను చిన్నప్పటి నుంచి చూసిన పరిశుభ్రమైన, పచ్చని, సురక్షితమైన ఢిల్లీని మళ్లీ కాంగ్రెస్ మాత్రమే తీసుకురాగలదని, రాజకీయాల్లో నిజాయితీగా నిలబడే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ మాత్రమే అని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆప్ తన మూల సిద్ధాంతాల నుంచి తప్పుకుందని, బంగ్లాలు, కార్లు వద్దన్నవారే ఇప్పుడు వ్యక్తిగత ప్రయాణాలకు చాపర్లు వాడుతున్నారని, పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి కొత్తవారికి పెద్ద పదవులు కట్టబెడుతున్నారని ఆమె తీవ్రస్థాయిలో ఆరోపించారు.

# మమతకు మరో చిక్కు.. గాయం ఫేక్ అంటూ సీఎం సువేందు వ్యాఖ్యలు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి పాత వివాదం తెరపైకి వచ్చింది. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నందిగ్రామ్‌లో అప్పటి సీఎం మమతా బెనర్జీ కాలికి తగిలిన గాయం 'ఫేక్' అంటూ ప్రస్తుత సీఎం సువేందు అధికారి సంచలన ఆరోపణలు చేశారు. తన ఆరోపణలకు మద్దతుగా వైద్యపరమైన పత్రాలు తన వద్ద ఉన్నాయని, ఎవరైనా సవాల్ చేస్తే వాటిని బహిర్గతం చేస్తానని చెప్పారు. నందిగ్రామ్-2 బ్లాక్‌లోని బిరులియా బజార్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ తరఫున ప్రచారం చేస్తూ సువేందు అధికారి ఈ వ్యాఖ్యలు చేశారు. 2021లో మమతకు గాయం జరిగిన ప్రాంతం ఇదే. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి వెళ్లానని సువేందు తెలిపారు. భబానీపూర్ నియోజకవర్గ పరిధిలో ఆస్పత్రి ఉండటంతో ఆస్పత్రి కమిటీ అధ్యక్షుడిగా తనకు కొన్ని వివరాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మమతకు సంబంధించిన ఎక్స్‌రే రిపోర్టు కాపీ తన వద్ద ఉందని, అందులో ఆమె వైద్యులు 'ఫ్రాక్చర్ లేదు' అని పేర్కొన్నారని ఆయన ఆరోపించారు.

అసలు ఏం జరిగింది?

2021 మార్చి 10న నందిగ్రామ్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా మమతా బెనర్జీ గాయపడ్డారు. తన వాహనం వద్ద భారీగా గుమిగూడిన జనంతో జరిగిన తోపులాటలో కాలు వాహనం తలుపు మధ్య ఇరుక్కుపోయిందని ఆమె అప్పట్లో చెప్పారు. అనంతరం ఆమెను కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో ఎస్ఎస్‌కేఎం వైద్యులు చేసిన ప్రాథమిక పరీక్షల్లో ఎడమ చీలమండ, పాదంలో తీవ్ర బోన్ ఇంజరీస్‌తో పాటు కుడి భుజం, ముంజేయి, మెడ తదితర ప్రాంతాల్లో గాయాలు ఉన్నట్లు వెల్లడించారు. మార్చి 12న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన మమత ఎడమ కాలికి కాస్ట్‌తో వీల్‌చైర్‌లోనే ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. అయితే తాజాగా సువేందు అధికారి మాత్రం ఆ గాయం తీవ్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. వాహనం తలుపు రోడ్డుపక్కన ఉన్న ఇనుప స్తంభాన్ని ఢీకొని తిరిగి మమత కాలికి తగిలిందని, దాంతో స్వల్ప గాయం మాత్రమే అయిందని ఆయన వాదించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలను బహిరంగపరుస్తానని సువేందు ప్రకటించడంతో 2021 నాటి నందిగ్రామ్ ఘటన మరోసారి పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఆయన తాజాగా ప్రస్తావించిన పత్రాలు పూర్తిగా బహిరంగంగా అందుబాటులోకి వచ్చాయా, వాటిలో ఏముంది అనే విషయం ఇంకా స్పష్టంగా వెల్లడికాలేదు.

# తెలంగాణలో అమిత్ షా పర్యటన రద్దు



హైదరాబాద్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం (అక్టోబర్ 4న) తెలంగాణలో పర్యటించాల్సి ఉండగా దాన్ని రద్దు చేసుకున్నారు. ముందుగా ప్రకటించాల్సిన షెడ్యూల్ ప్రకారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది ఆ తర్వాత హైదరాబాద్‌కు వస్తారని బీజేపీ వర్గాలు భావించాయి. ఇటీవల తెలంగాణకు కొత్తగా నియమితులైన ఇన్‌ఛార్జ్‌లతో భేటీ అయ్యే ఛాన్స్ ఉందని బీజేపీ నేతలు అనుకున్నారు. అమిత్ షా ఆదివారం తూప్రాన్ మండలంలోని బ్రహ్మణపల్లిలో పర్యటించనున్నారన్న సమాచారం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఏఎస్ఎల్ సమావేశం నిర్వహించారు. అమిత్ షా పర్యటనకు సంబంధించిన భద్రతా ప్రణాళిక వేసుకున్నారు. చివరకు అమిత్ షా పర్యటన రద్దయింది.

# యోగితో ఢీ.. మోనానే ఎందుకు? తెరవెనుక లెక్క ఇదే!



ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సుమారు ఆరు నెలల సమయం ఉన్న వేళ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంలో కీలక మార్పు చేసింది. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆరాధనా మిశ్రా 'మోనా'కు యూపీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. సీనియర్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ కుమార్తె అయిన మోనా.. ఇప్పటివరకు కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా ఉన్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా పార్టీని నడిపించే బాధ్యత ఆమె భుజాలపై పడింది. మోనాను రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎంపిక చేయడంతో పాటు కాంగ్రెస్ సంస్థాగత బృందంలోనూ పలు మార్పులు చేసింది. సహారన్‌పూర్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, దేవిందర్ నిషాద్, అలోక్ ప్రసాద్‌లను సీనియర్ వైస్ ప్రెసిడెంట్లుగా నియమించింది. మోనా స్థానంలో చౌధరి వీరేంద్ర సింగ్‌ను కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా నియమించింది. ఈ కూర్పులో బ్రాహ్మణ, ముస్లిం, ఓబీసీ, దళిత ప్రాతినిధ్యాన్ని కలిపే ప్రయత్నం కనిపిస్తోందని రాజకీయ విశ్లేషణలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ మాత్రం ఈ నియామకాలను సంస్థాగత పునర్వ్యవస్థీకరణగా చెబుతోంది. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలను సమీకరించడం, ఎన్నికలకు సంస్థను సిద్ధం చేయడం కొత్త బృందం ముందున్న ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించుకుంది. 1974 ఏప్రిల్ 20న జన్మించిన ఆరాధనా మిశ్రా రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. ఆమె తండ్రి ప్రమోద్ తివారీ కాంగ్రెస్‌లో సీనియర్ నేత. ప్రతాప్‌గఢ్ జిల్లాలోని రాంపూర్ ఖాస్ నియోజకవర్గం నుంచి 2014 ఉప ఎన్నికలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన మోనా.. 2017, 2022 ఎన్నికల్లోనూ అదే స్థానాన్ని నిలబెట్టుకున్నారు. దీంతో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

## అఖిలేశ్‌తో సమన్వయం కీలకం

మోనా ముందున్న మరో కీలక అంశం సమాజ్‌వాదీ పార్టీతో సమన్వయం. 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్--ఎస్పీ మధ్య సీట్ల పంపకంపై చర్చలు జరగాల్సి ఉంది. ఇరు పార్టీల మధ్య స్థానాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్న నేపథ్యంలో ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. అయితే అఖిలేశ్ యాదవ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని మోనా ఇప్పటికే చెప్పారు. ఎస్పీని ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా పేర్కొంటూ.. రాబోయే ఎన్నికల్లో కూటమి సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## యోగి సర్కార్‌ను ఢీకొట్టే బాధ్యత

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌ను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడం మోనా ముందున్న ప్రధాన బాధ్యత. పార్టీ క్యాడర్‌ను పునర్వ్యవస్థీకరించడం, సంస్థాగత బలాన్ని పెంచడం, ఇతర పార్టీలతో ఎన్నికల సమన్వయం వంటి అంశాలపై ఆమె దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

## ఆమెనే ఛాయిస్ ఎందుకు?

ఇక్కడే కాంగ్రెస్ తాజా మార్పుపై అసలు చర్చ మొదలవుతోంది. ఇప్పటివరకు యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న అజయ్ రాయ్ స్థానంలో మోనాను తీసుకురావడం కేవలం నాయకత్వ మార్పుగానే కాకుండా పార్టీ సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను పునర్వ్యవస్థీకరించే ప్రయత్నంగా కూడా విశ్లేషణలు ఉన్నాయి. అజయ్ రాయ్ బదులుగా తూర్పు యూపీకి చెందిన బ్రాహ్మణ మహిళా నేతను అధ్యక్షురాలిగా, పశ్చిమ యూపీకి చెందిన ముస్లిం నేత ఇమ్రాన్ మసూద్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం ఈ కూర్పులో కీలక అంశంగా కనిపిస్తోంది. అదే సమయంలో అఖిలేశ్ యాదవ్‌తో మోనా కుటుంబానికి ఉన్న రాజకీయ సంబంధాలపై కూడా చర్చ జరుగుతోంది. మరోవైపు అఖిలేశ్ నేతృత్వంలోని ఎస్పీపై తరచూ విమర్శలు చేసిన ఇమ్రాన్ మసూద్‌కు కీలక పదవి ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. అంటే.. ఒకవైపు ఎస్పీతో సమన్వయానికి అవకాశం ఉన్న నాయకత్వం, మరోవైపు పశ్చిమ యూపీలో పార్టీ సామాజిక విస్తరణకు ఉపయోగపడే ముఖాన్ని ఒకే బృందంలోకి తీసుకురావడం కాంగ్రెస్ తాజా కూర్పులో కనిపిస్తున్న అంశం. మొత్తంగా.. రాజకీయ కుటుంబ నేపథ్యం, మూడుసార్లు ఎమ్మెల్యేగా అనుభవం, రాష్ట్ర రాజకీయాలపై అవగాహనతో పాటు సామాజిక--ప్రాంతీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకున్న కొత్త టీమ్‌లో మోనా కేంద్ర బిందువుగా నిలిచారు. ఇక 2027 ఎన్నికల ముందు ఆమె కాంగ్రెస్ సంస్థను ఎలా నడిపిస్తారన్నదే కీలకం కానుంది.

# ఉన్నత 'మిథ్య'

దేశవ్యాప్తంగా ప్రభుత్వాలనుంచి తీవ్ర ప్రతిఘటన వస్తున్నా, ఒక్కోసారి దౌర్జన్యం జరుగుతున్నా కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కార్యకర్తలు ప్రాథమిక పాఠశాలలు సందర్శించి అక్కడి దారుణ పరిస్థితుల్ని చాటుతున్నారు. ఉన్నత విద్య సైతం ఈ దేశంలో అలాగే అఘోరించిందని ఇటీవల విడుదలైన ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కుండబద్దలుకొట్టింది. ఒకపక్క ప్రపంచంలో ఏ దేశానికీ లేని స్థాయిలో మనకు యువశక్తి పుష్కలంగా ఉన్నదని డబ్బా కొట్టుకొంటున్నా... ఆ యువత తమ సత్తా చాటడానికి అవసరమైన సదుపాయాలేమీ లేవని సీజేపీ విడుదల చేస్తున్న వీడియోలు, ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ఏక కంఠంతో చెబుతున్నాయి. మరి స్వాతంత్ర్యానంతరం ఇన్ని దశాబ్దాల్లో ప్రభుత్వాలు ఏం సాధించినట్టు? మనది శరవేగంతో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని మొన్న జూలైలో అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థ ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మన వృద్ధి రేటు 7.8 శాతం. రిజర్వ్ బ్యాంక్ అంచనా 7.0 శాతం కన్నా ఇది అధికం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ప్రస్తుతం మనం ఆరో స్థానంలో ఉండగా... మరో పాతికేళ్లలో భారత్ తొలి స్థానానికి ఎగబాకుతుందని అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ ఆర్థికవేత్త జెఫ్రీ శాక్స్ ఇటీవల అంచనా వేశారు. గర్వపడాల్సిందే. కానీ ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్య వరకూ అంతా నాసిరకంగా ఉన్నప్పుడు ఇదంతా ఎలా సాధ్యమన్న ప్రశ్న ఎవరికైనా వస్తుంది... పాలకులకు తప్ప! మనం అమెరికా, చైనాలను అధిగమించబోయే క్రమంలో ఉన్నాంగనుక ఆ రెండు దేశాల్లోనూ విద్యావ్యవస్థలెలా వున్నాయో తెలుసుకోవటం అవసరం. అమెరికా యూని వర్సిటీలు 2024లో ఉన్నత విద్యకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కోసం 11,770 కోట్ల డాలర్ల నిధులు పొందాయని ఒక నివేదిక చెబుతోంది. ఇందులో ప్రభుత్వాలనుంచి వచ్చింది 6,460 కోట్ల డాలర్లు. మన దగ్గర ప్రభుత్వాలే కాదు... వాటినుంచి ఎకరా 99 పైసలకు వందల ఎకరాలు పొందే ప్రైవేటు సంస్థలు సైతం ఉన్నత విద్యకు నిధులు రాల్చటం లేదని దీన్నిబట్టి తెలుస్తుంది. చైనాలో పరిశోధన, అభివృద్ధి రంగాలకు 2024లో కేటాయించిన మొత్తం దాని వృద్ధి రేటులో 2.69 శాతం. అదే కాలంలో ఉన్నత విద్యారంగంలో మన వ్యయం జీడీపీలో కేవలం 0.84 శాతం. ఉన్నత విద్య వరకూ అన్ని దశలూ ప్రజలకు అందుబాటులో ఉండటం, మౌలిక సదుపాయాలపై అపారంగా వ్యయం చేయటం, వ్యూహాత్మక పరిశోధనకు పెద్ద మొత్తంలో నిధులు వ్యయం చేయటం, పటిష్టమైన ప్రభుత్వ సమన్వయం చైనా ప్రత్యేకతలు. మనం ఆ స్థాయికి చేరుకోవటానికి ఎన్ని దశాబ్దాలు పడుతుంది? మన యూనివర్సిటీలు, కళాశాలలు... వాటిల్లో చేరే విద్యార్థుల సంఖ్య గత కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిన మాట



వాస్తవమే అయినా, వీరికి బోధించేందుకు అవసరమైన సిబ్బంది లేరు. దాదాపు మంజూరైన అధ్యాపక పోస్టుల్లో అన్నిచోట్లా మూడోవంతు ఖాళీగా పడివున్నాయి. ప్రస్తుత ఉన్నత విద్యా సంస్థల సంఖ్య 64,756 కాగా, 2014తో పోలిస్తే వీటి వృద్ధి 47 శాతం. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 4.5 కోట్లు. అధ్యాపకులసంఖ్య కూడా 2013--14 మధ్య ఉన్న 13.7 లక్షలనుంచి 17.3 లక్షలకు చేరింది. కానీ ఇంకా 34 శాతం పోస్టులు ఖాళీ. ప్రొఫెసర్ల స్థాయిలో ఈ ఖాళీలు 54 శాతం. కనీసం పెరిగిన సంఖ్యకు తగినట్టయినా ప్రమాణాలు పెంచటం, పరిశోధన రంగాన్ని పటిష్ట పర్చటం, యూనివర్సిటీలను పరిశ్రమలతో అనుసంధానించటం వంటివి చేయనట్టయితే మన యువతకు బంగారు భవిష్యత్తు ఎలా? ప్రపంచశ్రేణి అభ్యసన పద్ధతుల్ని తీసుకొచ్చి మరింత సామర్థ్యంతో, లోపరహితంగా పరీక్షలు నిర్వహించటానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పడింది. అంతవరకూ ఆ బాధ్యతల్ని చూస్తున్న సీబీఎస్ఈ, ఏఐసీటీఈ, వివిధ యూనివర్సిటీలను కాదని ఎన్‌టీఏకు అప్పగించారు. సీజేపీ ఆవిర్భావానికి ఎన్‌టీఏ నిర్వాకమే దారితీసిందంటే తన కప్పగించిన బాధ్యతను అది ఎంత దివ్యంగా నిర్వహించిందో గ్రహించవచ్చు. ప్రతిభను పాడె ఎక్కించే విధానాలనూ, నిర్లక్ష్యాన్నీ, నిరాసక్తతనూ ఇప్పటికైనా ప్రభుత్వాలు విడనాడాలి. ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్యవరకూ సమూల ప్రక్షాళనకు సంసిద్ధం కావాలి. లేనట్టయితే సాధించిన, సాధించబోయే అభివృద్ధి అర్థరహితమవుతుంది.

# ఫ్లైదుబాయ్ ఘటన.. ఉగ్రదాడే: యూఏఈ సంచలన ప్రకటన!




ఫ్లైదుబాయ్ విమాన ఘటనపై ఇప్పటివరకు ఉన్న అనుమానాలకు తెరదించే కీలక ప్రకటన వెలువడింది. కెప్టెన్ స్మిట్ మచ్చార్‌పై కాక్‌పిట్‌లోని క్రాష్ యాక్స్‌తోనే కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ దాడికి యత్నించాడని యూఏఈ తెలిపింది. అంతేకాదు.. ఈ ఘటనను ఉగ్రదాడిగా దాదాపుగా నిర్ధారించింది. దుబాయ్ నుంచి టెల్‌అవీవ్ వెళ్తున్న ఎఫ్‌జెడ్1073 విమానంలో కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ.. కెప్టెన్ స్మిట్ మచ్చార్‌పై కాక్‌పిట్‌లోని క్రాష్ యాక్స్‌తో దాడి చేసి, విమానాన్ని తన నియంత్రణలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడని యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ హమద్ సైఫ్ అల్ షమ్సీ శనివారం వెల్లడించారు. ఈ చర్యను 'టెర్రరిస్ట్ అటాక్'గా పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులు, ఉద్దేశం, ఇతరులతో సంబంధాలు, ఫిజికల్-డిజిటల్ ఆధారాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

## విమానం కంట్రోల్ కోసం ప్రయత్నం

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్‌అవీవ్ బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కో-పైలట్ స్మిట్ మచ్చార్‌పై దాడి చేసిన అనంతరం విమాన నియంత్రణను చేపట్టేందుకు ప్రయత్నించాడని యూఏఈ అధికారులు తెలిపారు. సాధారణంగా విమానాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే క్రాష్ యాక్స్ కాక్‌పిట్‌లోనే ఉంటుంది. అదే పరికరాన్ని దాడికి ఉపయోగించినట్లు తాజా దర్యాప్తు వివరాలు వెల్లడిస్తున్నాయి.

## వేల అడుగుల మేర ఒక్కసారిగా కిందికి

కాక్‌పిట్‌లో ఘర్షణ జరుగుతున్న సమయంలో విమానం ఒక్కసారిగా వేగంగా కిందికి దిగింది. వివిధ నివేదికల ప్రకారం విమానం దాదాపు 14 వేల నుంచి 17 వేల అడుగుల మేర ఎత్తు కోల్పోయింది. విమానంలో 170 మందికి పైగా ఉన్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ కెప్టెన్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరవగలిగారు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లి కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## ఆ ఇద్దరు పైలట్లతోనే విమానం సేఫ్

విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు పరిస్థితిని చక్కదిద్దేందుకు ముందుకొచ్చారు. వారు విమాన నియంత్రణ చేపట్టి దానిని సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయానికి మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఘటన అనంతరం సౌదీ అధికారులు కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని విచారణ కోసం యూఏఈకి తరలించారు.

## హమామ్.. గతంపైనా దర్యాప్తు

కో-పైలట్‌ను హమామ్ అల్-హమ్మామీగా గుర్తించారు. అతడు ఒమన్ జాతీయుడని దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ తెలిపింది. అతడి గత రికార్డులపైనా ఇప్పుడు అధికారులు దృష్టి పెట్టారు. 2024లో ఒమన్ ఎయిర్‌లో కో-పైలట్ ట్రైనీగా ఉన్న సమయంలో అతడి వద్ద తీవ్రవాద భావజాలానికి సంబంధించిన మెటీరియల్ లభించడంతో విమానాలు నడపకుండా నిలిపివేసినట్లు అమెరికా అధికారులు తెలిపినట్లు ఏబీసీ న్యూస్ పేర్కొంది. అయితే ఆ తర్వాత అతడు పరిపాలనా విభాగంలో కొనసాగినట్లు సమాచారం. అసలు అలాంటి నేపథ్యం ఉన్న వ్యక్తి తర్వాత ఫ్లైదుబాయ్‌లో కో-పైలట్‌గా ఎలా చేరాడు? అతడికి క్లియరెన్స్ ఎలా లభించింది? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రశ్నలే ప్రస్తుతం విచారణలో కీలకంగా మారాయి.

## ఉగ్ర సంస్థలతో సంబంధాలున్నాయా?

కో-పైలట్ ఒంటరిగానే ఈ దాడికి పాల్పడ్డాడా? లేదంటే ఏదైనా తీవ్రవాద సంస్థతో సంబంధం ఉందా? ముందస్తు ప్రణాళిక ఉందా? ఎవరైనా అతడిని ప్రేరేపించారా? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ ప్రకారం భౌతిక, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయ్యాక తుది వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

## మచ్చార్ ధైర్యంతో తప్పిన పెను ప్రమాదం

దాడిలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిట్ మచ్చార్ మాత్రం పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచారు. దీంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడి చేసిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకోగలిగారు. మరోవైపు ఆఫ్-డ్యూటీ పైలట్లు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. మచ్చార్ ప్రస్తుతం కోలుకుంటున్నారు.

## ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ.. విద్యకు భరోసా
## ప్రశస్త యాప్ ద్వారా స్క్రీనింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎంఈవోలకు అవగాహన కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ




విజయవాడ శ్రీ వార్త న్యూస్:ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చిన్న వయసులోనే గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు, వసతులు కల్పిస్తూ సాధారణ పిల్లలతో సమానంగా విద్యను అభ్యసించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్య, గుర్తింపు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై జిల్లాలోని ఎంఈవో-1, ఎంఈవో-2లకు శనివారం విజయవాడలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఉపాధ్యాయులు చిన్న వయస్సులోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్ ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించడంతో పాటు, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, వైద్యం, పునరావాసం తదితర సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి భవిత సెంటర్‌లో సుమారు 20 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. భవిత సెంటర్ల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ,స్పీచ్ థెరపీ వంటి సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఐదు మున్సిపాలిటీలకు ఒక ఆటిజం సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 2,351 మందికి పైగా సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులు ఉన్నారని వెల్లడించారు.జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2016 ప్రకారం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తోందని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్,ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున, బాలికలకు రూ. 2,000 స్టైపెండ్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, విద్యాశాఖ అధికారులు, సహిత విద్యా సిబ్బంది, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.'

## వృద్ధాశ్రమాలు తగ్గాలి. ఉన్నవి బాగా వెలగాలి.....
## సత్యసాయి సమితి కన్వీనర్ ఆంజనేయ కుమార్



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:వృద్ధాశ్రమాలు తగ్గాలని, అందుకు ప్రతి మనిషి విలువలు కలిగి జన్మనిచ్చిన తల్లిదండ్రులను చూసుకోవాలని, అనివార్య కారణాలతో వృద్ధాశ్రమాల్లో ఉన్నవారి ఆశ్రమాలు చక్కగా నడిచేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ పిలుపునిచ్చారు.స్థానిక చిలకలపూడిలోని శ్రీ అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో శ్రీమతి మాదాసు రాజ్యలక్ష్మి సంవత్సరీకాన్ని పురస్కరించుకుని ఆమె మనుమరాళ్లు సింహాద్రి పావన లక్ష్మి, కొల్లిపర సాయి మోహిని, రత్నం భరణిలు అన్నదానం, నారాయణ సేవ నిర్వహించారు.అదేవిధంగా వృద్ధాశ్రమ అభివృద్ధికి శ్రీమతి అర్జ నాగమణి, ఆమె కుమారుడు మోహన వంశీ రూ. 15,000/- చెక్కును ఆశ్రమ నిర్వాహకురాలు కర్రెడ్ల సుశీలకు అందజేశారు.ఈ సందర్భంగా ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల సేవే పరమధర్మమన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు సుశీల మాట్లాడుతూ వృద్ధాశ్రమానికి అందరూ చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కోట కృష్ణ ప్రసాద్, లీలా ప్రసాద్, శ్రీహరి శ్రీనివాసులు, ఎన్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 11నుంచి 20 వరకు శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ....ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు)



నిజాంపేట్ శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి.:హైదరాబాద్ నగరం లోని, నిజాంపేట్ ప్రాంత భక్తుల ఆరాధ్య దైవం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 11 నుండి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న దేవి మహోత్సవాల వివరాలను భక్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అక్టోబర్ 11వ తేదీ ఆదివారం అమ్మవారి అవతారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి, 12వ తేదీ సోమవారం శ్రీ గాయత్రీ దేవి, 13వ తేదీ బుధవారం, శ్రీ అన్నపూర్ణా దేవి, 14వ తేదీ శ్రీ మహాచండీ దేవి,15వ తేదీ గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, 16 వ తేదీ శుక్రవారం శ్రీ సరస్వతీ దేవి,17వ తేదీ శనివారం శ్రీ మహాలక్ష్మి దేవి, 18 వ తేదీ ఆదివారం శ్రీ దుర్గా దేవి (బతుకమ్మ పండుగ ), 19 వ తేదీ సోమవారం శ్రీ మహిషాసుర మర్దనీ దేవి, 20 వ తేదీ మంగళవారం శ్రీ రాజ రాజేశ్వరీ దేవి అవతారాలతో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి భక్తులకు దర్శనమిస్తుందని ఆలయ అధ్యక్షులు శ్రీకాంత్ వివరించారు. ఆలయ అర్చక స్వాములు శ్రీధరమల్లె గౌతమ్ కుమార్,రాజు స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# సామాన్య భక్తులే కేంద్రంగా ఉత్సవాల ఏర్పాట్లు

వినూత్న కార్యాచరణతో సమగ్ర సౌకర్యాలు

ఏఐ డిస్‌ప్లే బోర్డులు, చైల్డ్ ట్యాగ్స్, బూమ్ బ్యారియర్స్

24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రంలి

మొత్తం 3,500 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు

ఉత్సవాల విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం.

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు, వీఎంసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం,ఈవో వీకే శీనా నాయక్





విజయవాడ శ్రీ వార్త న్యూస్:ఈ నెల 11వ తేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి 20వ తేదీ ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు జరిగే దసరా మహోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు.శనివారం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో శీనా నాయక్.. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, దేవాదాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సంయుక్త తనిఖీలు నిర్వహించారు. సీతమ్మవారి పాదాలు, కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్‌రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్లి ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించారు. భక్తులకు భద్రత, సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం కొండపై నలుగురూ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వినూత్న కార్యాచరణ రూపొందించామని, భక్తుల రాకపోకలు, దర్శనం, క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్నిఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా జరగనుందని.ఈ మేళాకు గౌరవ రాష్ట్రపతి కూడా రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ,2024 నుంచి టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యమిస్తూ వినూత్న ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తున్నామని.ఈసారి కూడా మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్స్ వంటి వాటిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గౌరవ సీఎం వారి మార్గనిర్దేశం మేరకు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తామన్నారు. మొత్తం 22 పార్కింగ్ పాయింట్లను ఏర్పాట్లు చేశామని.3,500 మంది సిబ్బందితో బందోబస్తు ఉంటుందని.. యంగ్ అండ్ డైనమిక్ పోలీసులు విధుల్లో నిమగ్నమవుతారన్నారు. ఈసారి క్రౌడ్ అనలిటిక్స్‌కు ప్రాధాన్యమిస్తూ నిరంతర సమగ్ర ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.వీఎంసీ ధ్యానచంద్ర. దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ దసరా స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు.ఈవో వీకే శీనా నాయక్. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభను ప్రతిబింబించేలా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.



# పొదుపు అలవాటుతోనే పేదరికం నుంచి విముక్తి.

చిరు వ్యాపారులు, విద్యార్థుల్లో పొదుపు అలవాటును పెంపొందించాలి....జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: చిరు వ్యాపారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ కుటుంబాలు, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పొదుపు అలవాటును పెంపొందించడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ), తపాలా, విద్యాశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పొదుపు ప్రాముఖ్యతపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి యూనిట్లు నిర్వహిస్తున్న అనేక కుటుంబాలకు నెలవారీగా కొంతమేర స్థిరమైన ఆదాయం ఉన్నప్పటికీ, పొదుపు అలవాటు లేకపోవడం వల్ల అత్యవసర సమయంలో అప్పులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. వచ్చిన ఆదాయాన్ని పూర్తిగా ఖర్చు చేయకుండా, రోజువారీగా లేదా వీలైనంత తరచుగా కొంత మొత్తాన్ని పొదుపు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.పూర్వంలో అమలులో ఉన్న పిగ్మీ పొదుపు విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, తపాలాశాఖ ద్వారా 'మైక్రో సేవింగ్స్' విధానాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. తపాలా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బయోమెట్రిక్ పరికరాల ద్వారా పొదుపు మొత్తాలను ఖాతాల్లో జమ చేసే సౌకర్యాన్ని ప్రజలకు వివరించి, ఆసక్తి ఉన్నవారితో ఖాతాలు తెరిపించాలని చెప్పారు. రోజుకు రూ.50, రూ.100 లేదా వారి సామర్థ్యానికి అనుగుణంగా చిన్న మొత్తాలను క్రమం తప్పకుండా పొదుపు చేసే అలవాటు ఏర్పడితే భవిష్యత్తులో కుటుంబాలకు ఆర్థిక భద్రత ఏర్పడుతుందన్నారు.మండల స్థాయిలో ఏపీఎంలు,తపాలా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని వీవోఏలు, పోస్టుమాస్టర్లను అనుసంధానం చేయాలని కలెక్టర్ సూచించారు.చిరు వ్యాపారులు, జీవనోపాధి యూనిట్లు నిర్వహిస్తున్న వారు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులను గుర్తించి పొదుపు ఖాతాలు తెరిపించాలని ఆదేశించారు.అవసరమైన చోట డీఆర్డీఏ అధికారులు, తపాలా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.విద్యార్థుల్లో కూడా చిన్న వయసు నుంచే పొదుపు అలవాటు పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గుర్తించిన సుమారు 19 వేల మంది విద్యార్థుల్లో ఇప్పటివరకు సుమారు 1,200 మందికి మాత్రమే ఖాతాలు తెరిచిన నేపథ్యంలో మిగిలిన అర్హులైన విద్యార్థులకు కూడా పొదుపు ఖాతాలు తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు పొదుపు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించి, వారు తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాన్ని వివరించేలా చూడాలన్నారు.పొదుపు అనేది కేవలం డబ్బు దాచుకోవడం మాత్రమే కాదని, కుటుంబాలకు ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేయడం ద్వారా పేదరికం నుంచి బయటపడే సామర్థ్యాన్ని పెంచే సాధనమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా నిరంతరం సహాయం అందించడం కంటే, కుటుంబాలు స్వయం సమృద్ధి సాధించి భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఆర్థికంగా బలోపేతం కావడమే అసలు లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ, తపాలా, విద్యాశాఖల అధికారులు పాల్గొని గ్రామస్థాయిలో చేపట్టనున్న కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పొదుపు ఖాతాల ప్రారంభం, డిపాజిట్లపై మండలాల వారీగా, గ్రామాల వారీగా రోజువారీ నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీఎంల వారీగా ఎన్ని ఖాతాలు ప్రారంభించారు, ఎంత మొత్తంలో పొదుపు ప్రారంభమైంది అనే వివరాలతో గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో రోజువారీ సమాచారాన్ని నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ప్రారంభ దశలో ప్రతిరోజూ నివేదికలను పరిశీలించి, కార్యక్రమం గాడిలో పడే వరకు నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఏ పీడీ హరిహరినాథ్, తపాల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీఈవో యువి సుబ్బారావు, మండల విద్యాధికారులు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 11 నుంచి 20 వరకు బంటుమిల్లి కనకదుర్గ ఉత్సవాలు

బంటుమిల్లి,శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి ::కృష్ణా జిల్లా, బంటుమిల్లి ప్రాంత భక్తుల ఆరాధ్య దైవం శ్రీ కనక దుర్గ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నూతన అధ్యక్షులు గోపిశెట్టి ధనంజయ రావు తెలిపారు. అక్టోబర్ 11 నుండి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న కనక దుర్గ మహోత్సవాల వివరాలను భక్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అక్టోబర్ 11వ తేదీ ఆదివారం అమ్మవారి అవతారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి, 12వ తేదీ సోమవారం శ్రీ గాయత్రీ దేవి, 13వ తేదీ బుధవారం, శ్రీ అన్నపూర్ణా దేవి, 14వ తేదీ శ్రీ మహాచండీ దేవి, 15 వ తేదీ గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, 16వ తేదీ శుక్రవారం శ్రీ సరస్వతీ దేవి,17వ తేదీ శనివారం శ్రీ మహాలక్ష్మి దేవి,18 వ తేదీ ఆదివారం శ్రీ దుర్గా దేవి, 19 వ తేదీ సోమవారం శ్రీ మహిషాసుర మర్దనీ దేవి, 20 వ తేదీ మంగళవారం శ్రీ రాజ రాజేశ్వరీ దేవి అవతారాలతో శ్రీ కనక దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిస్తుందని ఆలయ అధ్యక్షులు ధనంజయ రావు వివరించారు. ఇలా ఉండగా ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు, ఆయన సతీమణి శ్రీమతి జానకీ లక్ష్మి అమ్మవారి సేవకులుగా వున్నారు.



Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001